గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మార్చి 2017
# కథలు




హోటల్ బంజారా..సమయం సాయంత్రం ఆరుగంటలు.

ఆల్ ఇండియా సైకియాట్రిస్ట్ ల కాన్ఫరెన్సునుండి బైటకొస్తున్న ”బాలి వెర్నా కార్” కు అడ్డమొచ్చిన వ్యక్తి ని రక్షించాలని సడన్ బ్రేక్..వేశాడు అవినాష్. కార్ ను గమనించకుండా హడావిడిగా వెళ్ళిపోతున్న వ్యక్తిని చూస్తూనే కార్ దిగి .. పరుగెత్తుకెళ్ళి..

“డాక్టర్ రవీ! కాన్ ఫరెన్స్ లో ఉండవలసి నువ్వుయిలా?”

“ఏమిచేయమంటావ్ మిస్టర్ బాలి?ప్రాణభయం.”

“ఓకే!      తర్వాత మాట్లాడుదాం ..ముందు కారెక్కు ..”

“నా కారు పార్కింగ్ లో వుంది.”

“కార్ నెంబర్ చెప్పి కీస్ అవినాష్ కు యివ్వు.అవినాష్! టేక్ కేర్ .”

అప్పటికే స్టెల్లా డ్రైవింగ్ సీటులో..శిరీష ఫ్రంట్ సీటులో సెటిలై పోయారు. కార్ ఆఫీసు ముందు ఆగింది .అందరూ లోపలికి వచ్చేసారు.

‘”రవీ!మా జానీ గెస్ట్ రూం చూపిస్తాడు..ముందు రిలాక్ష్ అయిపో.తర్వాత ప్రాణభయం ఎపిసోడ్..

జానీ! అల్మైరాలో న్యూ నైట్ డ్రెస్ లున్నాయి.సార్ క్రిందకి రాగానే అందరికీ స్ట్రాంగ్ కాఫీలు.”

ఓకే బాస్ !

జానీ డాక్టర్ ని పైకి తీసుకెళ్ళి పోయాడు.అవినాష్ వచ్చి..

“బాస్ నేను కార్ తీస్తుంటే పార్కింగ్ ప్లేస్ లో ఆ కారునే గమనిస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పదం గా కనిపించాడు నన్ను చూస్తునే తప్పుకున్నాడు. ఫోటో తీసే చాన్సు దొరకలేదు.”

“ఫర్గెట్ ఇట్..మన రవికిరణ్ ..సైకియాట్రిస్ట్..గుర్తున్నాడా?వెరీ ఫేమస్..డాక్టర్..మన సిటీలో. తనని ఈ స్టేజ్ లో చూడ్డం చాలా వింతగా గా వుంది.మనిషి చాలా భయపడి పోయాడు.నాకు క్లోజ్ ఫ్రెండ్.మంచి మనసున్న మనిషి.”

“ఓకే బాస్ ..డాక్టర్ గారు వస్తున్నారు..స్టెల్లాని..”

“స్టెల్లా..శిరీషలు కూడా వస్తున్నారు.జాకీని కూడా ..రమ్మను.”

“ ఓకే బాస్ ! హిఈజ్ ఆల్రెడీ ఇన్ అవర్ లైబ్రరీ.

జానీ కాఫీ ట్రే తో ఎంటరై పోయాడు.

“రవీ! హౌఅర్యూ? నౌ ఓకేనా ?”

“ఎస్..నేనే..కాన్ ఫరెన్స్ అయ్యాక నిన్ను మీట్ అవుదామనుకున్నా..సాయంత్రం టీ బ్రేక్ లో వాడిని గమనించాను.. వాడు నన్నే షాడో లా ఫాలో అవుతున్నాడని.భయమేసింది. తప్పించు కోవాలని బయటికొచ్చా.వాడూ నాతోనే బయటి కొచ్చాడు.కార్ వదిలిపెట్టి..పారిపోవాలనుకుని ఆ టెన్షన్లో నీ కారుకి అడ్డం వచ్చాను.”

“నీడ్ నాట్ వర్రీ.విఆర్ ఆల్ హియర్.నౌ టెల్ మి ద ఫాక్ట్స్.’

స్టెల్లా తన నోట్ పాడ్ తో రెడీ గా వుంది.

“పోయినవారం..సండే..ఆరోజు అనుకోకుండా వాన పడింది..అప్పుడు నాతో బాటు విలియమ్స్ అనే పేషెంట్ కౌన్సిలింగ్ లోవున్నాడు. అప్పుడు నా రిసెప్షన్ గర్ల్ రమ్య వచ్చి..”

“సర్ !విలియమ్స్ ఇంటినుంచి ఫోన్ వచ్చింది..వాళ్ళ పాపకు ప్రమాదం జరిగిందని వాళ్ళ వైఫ్ గాబరా పడుతోంది.”

“నేను విలియమ్స్ తో విషయం చెప్పాను.వెంటనే బయలు దేరాలంటే పెద్ద వర్షం.బైక్ వుంది. నా రైన్ కోట్ యిచ్చి పంపించాను.గంట తర్వాత ఎస్ఐ , పోలిస్ లతో వచ్చాడు.నన్ను పోలిస్ స్టేషన్ కు రమ్మంటే షాక్ అయి పోయాను.”

“యస్ఐ..కారణం చెప్పాడా?”

“కారణం విలియమ్స్ ను ఎవరో మర్డర్ చేసారని అతని రైన్ కోట్ పోకెట్లో నా విజిటింగ్ కార్డ్ దొరికిందని.

నేను నిజం చెప్పాను.ఆ కోటూ విజిటింగ్ కార్డ్ నావే నని. అందరినీ సాక్ష్య మడిగి ..వార్నింగ్ యిచ్చి..వెళ్ళారు మూడోరోజు నేను విలియమ్స్ ఫ్యామిలి ని పరామర్శించాలని వాళ్ళ ఇంటి కెళ్ళి వచ్చే సరికి మళ్ళీ అదే ఎస్ఐ..విత్ పోలీస్.ఈ సారి నా క్లయింట్..మధులిక ను ఎవరో మర్డర్ చేసారని..ఆమె చేతిలో నా క్లినిక్ విజిటింగ్ కార్డ్ దొరికిందని..ఆమె నా క్లినిక్ ..నుంచే వెళ్తూ మర్డర్ అయ్యిందని అభియోగం..నేను క్లినిక్ లో లేని టైము అదే విలియమ్స్ ఇంటికి వెళ్ళిన టైం లో మర్డర్ చేసానని.. ఒక ప్రక్క పోలీస్ ..మరో ప్రక్క ఈ షాడో.. నన్ను చంపాలని .

బాలి! జీవితమంటేనే విసుగ్గా వుంది .”

“ఒక్కనిమిషం రవీ! విలియమ్స్ మర్డర్ మధులిక ..నీ క్లినిక్ కు వచ్చే ముందు జరిగిందా ? తర్వాతా?”

“ విలియమ్స్ ది అదే ఫస్ట్ సిట్టింగ్. మధులికది మూడో సిట్టింగ్ .దాదాపు నెలనుండి ..వస్తోంది.మొదటి రెండు సిట్టింగ్స్ లో యేమీ మాట్లాడలేదు. మొదటి సారి మొన్ననే నోరిప్పింది..”

“ఓకే ..తను యేమి చెప్పిందో గుర్తుందా?”

“సారీ బాలి ..క్లైంట్ చెప్తున్నప్పుడు నేను..వినను .రికార్డు చేసుకుని ఖాళీ సమయాలలో విని అనాలసిస్ చేసుకుంటాను..నోట్స్ రాసుకుంటాను.ఆరోజే మధులిక మర్డర్ జరగడము..నిన్నంతా సెమినార్ గొడవ మూలంగా మధులిక స్టేట్ మెంట్ వినలేకపోయాను.”

“ఇట్స్ ఆల్ రైట్..ఆ సిడి?”

“జనరల్ గా నా సెక్రటరీ డాక్టర్ ప్రియ అన్ని సిడీ లకూ లేబుల్స్ వేసి నా డెస్క్ మీద పెడుతుంది.ఆ రోజ ...ప్రియ యా..గుర్తుకొచ్చింది..వాళ్ళ మమ్మీ కీ డాక్టర్ తో అపాయింట్మెంట్ వుందని మధ్యాహ్నమే వెళ్ళిపోయింది.”

సో ఆ రికార్డెడ్ సిడి ..నా రూం లో నా డెస్క్ మీద రమ్య పెట్టి వుంటుంది.’

“గెట్ హార్ ఇన్ ఫోన్ ..”

“వన్ సెకండ్..”

ట్రై చేసి    నిస్సహాయంగా చూసి

“సారీ మిస్టర్ బాలి!స్విచ్ డాఫ్..వస్తోంది..ఐ విల్ ట్రై ప్రియ..యా.. వన్ మూమెంట్.. షి సెడ్ ..తనకి ఐడియా లేదట.”

“అవినాష్ ! గోటు ..క్లినిక్ .. అండ్ గెట్ ఇట్ ..రవి..టెల్ అడ్రస్ అండ్ గివ్ హిమ్ కీస్..” అరగంట తర్వాత అవినాష్ ఫోన్

“బాస్ !ఆ పేరుతో సిడి..లేదు..డాక్టర్ గారి రూం అంతా చిందరవందరగా వుంది..విండో బ్రేక్ చేసి వుంది.”

“రవి ! విన్నావుగా..వాట్ టు డు? డేంజర్ నిన్ను షాడో లా ఫాలో..అవుతోంది..నీ రైన్ కోట్ లో వున్న విలియమ్స్ ను నువ్వనుకొని మర్డర్ చేసుంటాడు.ఈ సారి నువ్వే టార్గెట్.ఓకే ..నేను ప్లాన్ చేస్తాను..అవినాష్ నీకు రమ్య అడ్రస్ ఫోన్ నెంబరు వాట్స్ యాప్ లో పంపిస్తా.తనని కలిసి ..”

“ఓకే బాస్..ప్లీజ్..”

******

“డాక్టర్! మీ దగ్గకొచ్చిన యస్ఐ..ది యే స్టేషన్?

“జూబిలీ హిల్స్..బాలీ..”

“జాకీ..ఆ స్టేషన్ సిఐ..రమణ కు నేను తెలుసు.నువ్వెళ్ళి రేపు హత్యజరిగిన ప్రదేశం చూస్తామని..ఎస్ఐ ని పంపించమని ..డాక్టర్ మన క్లైంట్ అని చెప్పు. కమీషనర్ తో మాట్లాడాలంటే..నాకు ఫోన్ చెయ్.

రవి!టేక్ రెస్ట్.హంతకుడు నిన్ను వెతుక్కుంటూ వస్తున్నాడు..వాడికి కావలసిన సిడి దొరికుండదు.అదే వాడికి బెట్.”

****

డాక్టర్ క్లినిక్ దగ్గరలోనే..వుంది..హత్యా స్తలం.యస్ ఐ నాయక్ బాలిని చూస్తూనే గుర్తు పట్టివిష్ చేసాడు .

“మీరంతా క్లూస్ కోసం వెదకండి. అనుమానం వుంటే ఫోటోలు తీయండి.మొన్న వాన పడింది. ఎలాంటి ప్రింట్స్ కనిపించినా..మనకు ఉపయోగ పడతాయి.”

అవినాష్ జాకీలతో బాటు స్టెల్లా కూడా ..జూమ్ కెమెరాతో..ప్రతి అంగుళాన్ని సెర్చ్ చేయడం లో నిమగ్నమై పోయింది.అరగంట తర్వాత స్టెల్లా ఆనందంతో అరిచేసింది..

“బాస్ ! ఐ గాట్ ఇట్.”

అందరూ..స్టెల్లాని ..చుట్టేసారు.

******

జూబిలీహిల్స్ పోలీస్ స్టేషన్.సిఐ రమణ ..యస్ఐ నాయక్ లను చూస్తూ     మధులిక కు సంబంధించి వస్తువులు ..చూపిస్తారా?

“షూర్ మిస్టర్ బాలి. “ అంటూ యస్ఐ స్వయంగా స్పెషల్ బాక్స్ లో భద్ర పరిచిన బేగ్..విజిటింగ్ కార్డ్..బాలి ముందుంచాడు.

“బాలి సాబ్ !..బాగ్ లో మధులిక పర్సనల్ సామానుతో బాటు సెల్ ఫోన్ మాత్రమే వుంది.పదివేలు కరేన్సీ వుంది.సెల్ లో తను చనిపోడానికి ముందు రికార్డు చేసిన ఆడియో క్లిప్పింగ్ వుంది.వినండి.”

“డాక్టర్ క్లినిక్ నుండి బయటికొచ్చాను.నేను కార్ డ్రైవ్ చేస్తూ రియర్ మిర్రర్ లోంచి గమనించాను.నన్ను మరో కారు ఫాలో అవుతోంది. పేస్ మాస్క్ వేసుకున్న మనిషి డ్రైవ్ చేస్తున్నాడు. భయం వేసింది.హటాత్తుగా నాకార్ ఆగిపోయింది.” “అంతే వుంది సాబ్. “

“భయంతో కారు దిగి పరుగులు తీస్తుంటే హంతకుడు వేటాడి..చంపేసుంటాడు..అప్పటికే హంతకుడు కారులో వెయిట్ చేస్తున్నాడంటే ..డాక్టర్ నిర్దోషే కదా?”

“బాలి సర్! అందుకే ఆయన్ని అరెస్ట్ చేయలేదు.ఈ కేస్ మీరు ఇన్వెస్ గేట్ చేస్తున్నారంటే హంతకుడు త్వరలోనే..”

“వియ్ విల్ ట్రై అవర్ బెస్ట్ ..ఏ క్లూ దొరికినా మీకు ఇన్ ఫాం చేస్తాను.థాంక్స్ ఒన్స్ అగైన్.”

****

“డాక్టర్ రవీ ! నువ్వూ అవినాష్ మీ హాస్పిటల్ కి వెళ్తున్నారు.ముందు నువ్వు నీ కార్లో వెళ్ళిపో.అవినాష్ నిన్ను ఫాలో..అవుతాడు.కానీ నువ్వు ఒక్కడివే క్లినిక్ లో రాత్రి ఉంటున్న ఫీల్ క్రి యేట్ చేయాలి .అవినాష్ బ్యాక్ డోర్ నుండి ఎంటర్ అవుతాడు. చీకటి పడే దాకా వాచ్ మేన్ తో మాట్లాడుతూ బయటే వుండు. అక్కడ ఏం చేయాలో అవినాష్ చెపుతాడు.మా జాకీ నైట్ విజన్ బైనాక్యులర్స్ తో క్లినిక్ బయటే వుండి గమనిస్తుంటాడు.విడియో రికార్డు చేస్తాడు. మనకు కావలసింది హంతకుడు కాదు..ఎవిడెన్స్. నువ్వేమి భయపడకు.అవినాష్ విల్ ప్రొటెక్ట్ యు.”

అర్ధ రాత్రి ఫోన్ రింగ్ అయింది. అవినాష్ వాయిస్.

“బాస్ మీ ప్లాన్ ప్రకారమే..ఫుట్ ప్రింట్స్ ..పడేలా మిరిచ్చిన ..పౌడర్ లిక్విడ్ డాక్టర్ రూంలో స్ప్రే చేసి..డాక్టర్ బెడ్ రూం లో పిల్లోస్ పెట్టి దుప్పి కప్పి డాక్టర్ నిద్ర పోతున్నాడన్న ఇమేజ్ క్రియేట్ చేసి మేం బాత్ రూంలో కాపు కాశాము.హంతకుడు వచ్చి డాక్టర్ అనుకుని పిల్లోస్ ను షూట్ చేసి..మునుపే విరగ్గొట్టిన కిటికిలోంచి పారిపోయాడు.

ఓకే అవినాష్ ..మనకు కావలసింది అదే.ఫుట్ ప్రింట్స్ ఫోటోలు తీసుకొని ..వెలుతురు రాకముందే వచ్చేయండి.

***

“బాస్ !జూబిలిహిల్ల్స్ పిస్ నుంచి రమణ ఫోన్ లో వున్నారు.”

అవినాష్ నుంచి ఫోన్ తీసుకున్నాడు బాలి .

“బాలి సర్ ! మీరు వెళ్ళాక మధులిక హస్బెండ్ ప్రముఖ కాంట్రాక్టర్ మనోహర్ వచ్చి చాలా గొడవ చేసాడు .వారం దాటిపోయినా హంతకుడిని పట్టుకోలేకపోయారని ..మమ్మల్ని మా డిపార్ట్ మెంట్ ని తెగ తిట్టి పోయారు. కమీషనర్ ఆఫీస్ నుంచి కూడా షంటింగ్ మొదలయ్యింది.సిటీ లో మనోహర్ ఓ బిగ్ షాటట. అందుకే మీకు ఫోన్ ..”

“మిస్టర్ రమణా! కేస్ ఫైనల్ స్టేజ్ లో వుంది. వెయిట్ ఫర్ వన్ టూ డేస్..ఐ విల్ టాక్ టు కమీషనర్ .”

*****

ఏసిపి శాండిల్య ఛాంబర్.ఏసిపి తో బాటు బాలి అవినాష్ లు వున్నారు .

“సర్ ! ఈ ఫొటోస్ చూడండి ..మధులిక హత్య జరిగిన చోట మా స్టెల్లా తీసిన ఫోటోలు. ఇవి డాక్టర్ క్లినిక్ లో దొరికిన ఫుట్ ప్రింట్స్

ఫోటోలు ’

“మిస్టర్ అవినాష్ ! ఇవి నాకెందుకు చూపిస్తున్నావ్?”

“సర్? ఇవే హంతకుడి ని పట్టించిన సాక్ష్యాలు..కొంచం కీన్ గా అబ్జర్వ్ చేయండి..మీకే..”

“షూ ప్రింట్స్..అంతే “

“యస్..యు అర్ కరెక్ట్ సర్..”

“శాండిల్యా! ఒకటి రైట్ షు..రెండోది లెఫ్ట్ షు..”

“ఎస్ బాలి..కానీ యిందులో..సాక్ష్యాలు ?”

“వున్నాయ్..లెఫ్ట్ లెగ్ షు..టెన్ నెంబర్..రైట్ లెగ్ షు లెవెన్ నెంబర్. రెండు ప్రింట్స్ చూడండి.సేం టు సేం. ఈ ఫోటో హత్యా స్థలంలో తీసింది. ఈఫోటో డాక్టర్ ఛాంబర్ లోది. మధులికని హత్య చేసిన హంతకుడే డాక్టర్ ని చంపాలని క్లినిక్ లో మొన్న ప్రవేశించి కాల్పులు జరిపాడు..మీరు మీ ఫోరెన్సిక్ డిపార్టుమెంటు తో చెక్ చేయించండి. రెండు ప్రింట్స్ ఒకరివే.నౌ విహేవ్ టు ఫైండ్ అవుట్ ద మర్డరర్..యా మై క్లియర్ మిస్టర్ శాండిల్యా ?”

“ఎస్ మిస్టర్ బాలి “

“మొన్న డాక్టర్ ఛాంబర్ లో హత్యా ప్రయత్నం జరిపిన వ్యక్తి ఫోటోలు తీసాం .కాని మాస్క్ ధరించాడు హంతకుడు.అయినా నొ ప్రొబ్లెం.అన్నట్లు రేపు మధులిక..పదోరోజు సెరిమని..మీరు వెళుతున్నారా?.

యా.. మనోహర్ వచ్చి ఇన్వైట్ చేసాడు ..సిటీ లో బిగ్ షాట్ మరి ?

అయితే రేపు కలుద్దాం..

***

“మిస్టర్ రమణా! రేపు మనోహర్ సెరిమని కీ..సారీ..మధులిక సెరిమనీ కీ వెళ్తున్నారా?”

“మాకు తప్పదు కదా మిస్టర్ బాలి..కమీషనర్ సార్ కూడా వస్తారు.మీరు ?”

“సారీ మిస్టర్ రమణా! పదోరోజు సెరిమనీ నాడే హంతకుడిని పట్టుకుంటానని మనోహర్ కి మాటిచ్చాను. మాట నిలబెట్టుకోవాలిగా?”

“అంటే రేపు ?”

“మీరే చూస్తారుగా.. “

****

జూబిలీ హిల్స్..మనోహర్ బంగ్లా..సెరిమనీ చాలా గ్రాండ్ గా జరిగిపోయింది.కమీషనర్ తో లాంజ్ లో మాట్లాడుతున్న ఏసిపి ఫోన్ మోగింది.

“మిస్టర్ మనోహర్ ! మధులికను హత్య చేసిన హంతకుడు దొరికాడట ..జూబిలీ హిల్స్ పియస్ లో మనకోసం డిటెక్టివ్ బాలి బృందం వెయిట్ చేస్తున్నారు. “

చెప్పేసి బయలు దేరుతున్న శాండిల్య ను రిక్వెస్ట్ చేస్తున్నట్లు..

“సర్ !నేను కూడా మీతో వస్తాను . నా భార్యను చంపిన హంతకుడిని నేను చూడాలి.”

“వైనాట్ ..కం..”

*****

జూబిలీ హిల్స్ పోలీస్ స్టేషన్.. నాయక్ రూం. బిగ్ సైజ్ మానిటర్ ముందు స్టేట్ ఫింగర్ ప్రింట్స్ ఎక్స్ పర్ట్ లతో బాలి బృందం. స్టేషన్ లోకి ఎంటర్ అయ్యేకారిడార్ సిసి కెమెరా ల్లో స్పష్టంగా కనిపిస్తోంది.అప్పటికే బాలి సూచనల మేరకు చేయ వలసిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసేసారు ఫింగర్ ప్రింట్స్ టెక్నికల్ స్టాఫ్.

ముందు సిఐ ..ఆయనతో బాటు ఏ సిపి ..ఆయన ప్రక్కనే మనోహర్.

సిసి కెమెరాని ఫ్లోర్ మీదికి ఫోకస్ చేశారు.ఫ్లోర్ మీద అందరి షు ప్రింట్స్ క్లియర్గా కనిపిస్తుంటే టెక్నికల్ స్టాఫ్ బాలి యిచ్చిన ప్రింట్స్ తో టేలి చేసుకుంటున్నారు.

టెక్నికల్ టీం లీడర్ ఓకే అన్నట్లు తమ్స్ అప్ సిగ్నల్ చూపించాడు.

నాయక్ బాలి సైగతో.. రూం బయటి కెళ్ళి సిఐ తో రహస్యంగా ఏదో చెప్పాడు.

రమణ ఏసిపి తో విషయం చెప్పాడు.

“వేర్ ఈజ్ ద మర్డరర్?ఐ వాంట్ టో సీ ద బాస్టర్డ్..”

గట్టిగా అరిచేస్తున్న మనోహర్ బుజం చుట్టు చెయ్యేసి..సిఐ   రమణ ..

“బి కూల్ మిస్టర్ మనోహర్ ! హి ఈజ్ ఇన్ ద సెల్..లెట్ అజ్ మూవ్ ..” అంటూ   సెల్ లోకి నడిపించి

“హి ఈజ్ దేర్..చూడండి”

అంటూ హటాత్తుగా బయటికొచ్చి..సెల్ డోర్ లాక్ చేసాడు.

“అరే ! సిఐ ! గేమ్స్ ఆడుతున్నావా? నేను ఏవరో తెలుసా..ఐ విల్ సీ యువర్ ఎండ్..”

అరిచేస్తున్న మనోహర్ మాటల్ని డామినేట్ చేస్తూ.. మధులిక మాటలు

“డాక్టర్! నాపేరు మధులిక.నా భర్త పేరు మనోహర్. ఏవన్ కాంట్రాక్టర్ .పెద్ద బంగ్లా మూడు కార్లు ..ఇంటినిండా నవుకర్లు. బ్యాంకు నిండా డబ్బు. మా పెళ్ళి అయిదు సంవత్సరాల క్రితం జరిగింది. నాకు పిల్లలు లేరు.పుట్టరు కూడా..ఆయన సంసారానికి పనికిరాడు. ఈ విషయం నేను బయటికి చెపుతానేమోనని చచ్చేంత అనుమానం. నన్ను చంపుతారేమోనని భయంగా వుంది.అందుకే మీ దగ్గరకు వచ్చాను. ఒక వేళ నేను చని పోతే..వీడి విషయం లోకానికి తెలియ చేయండి. హి ఈజ్..ఇంపోటెంట్...”

“సిడి ప్లేయర్ నుండి వస్తున్న సౌండ్ ఆగిపోయింది..”

అప్పటి వరకు అరుపులతో కేకలతో భయంకరంగా అరిచేసిన మనోహర్ సెల్ లో కుప్పకూలిపోయాడు.

****

పోలీస్ స్టేషన్ లోనే ప్రెస్ మీట్ యేర్పాటు చేసాడు రమణ.

బాలి తన పరిశోధన గురించి వివరించాడు.

“మధులిక డాక్టర్ తో కౌన్సిలింగ్ కు వెళ్తుందని గ్రహించాడు మనోహర్. తన రహస్యం బయిటికి పొక్కి పోతుందని భయపడిపోయాడు. ముందు డాక్టర్ ని తర్వాత మధులికని చంపేయాలని..ఆ రోజు క్లినిక్ నుండి డాక్టర్ యిచ్చిన కోట్ ధరించి బయటి కొచ్చిన విలియం ను డాక్టర్ గా పొరపాటుపడి..చంపేసాడు. మూడో సిట్టింగ్ తర్వాత బయటికి రాగానే ముసుగులో వెంబడించి మధులికను చంపేసాడు. ఇక మిగిలింది డాక్టర్

. అతని దగ్గరున్న సిడి.. అందుకే క్లినిక్ లో ప్రవేశించి డాక్టర్ ఛాంబర్ గాలించి సిడి దొరక్క పోవడంతో క్లినిక్ ను నాశనం చేసేసాడు. తర్వాత మరో సారి క్లినిక్ లోకి ప్రవేశించి ..బెడ్ మీద ఏర్పాటు చేసిన పిల్లో లనే డాక్టర్ అనుకోని ఫైర్ చేసాడు.

హత్యా స్థలంలో దొరికిన ఫుట్ ప్రింట్స్ మీద అనుమానం రావడంతో క్లినిక్ లో అవినాష్ పౌడర్ స్ప్రే చేసి ..ఫుట్ ప్రింట్స్ సంపాదించాడు.

కంపేర్ చేసి చూస్తే..రెండు ఒకరివే అని తేలిపోయింది.మా జాకీ మనోహర్ షు షాప్ ట్రేస్ చేసి ఆ నంబర్ షు మనోహరే కొన్నాడని కన్ఫం చేసాడు. ఆరోజు మధులిక మాటలు రికార్డు అయిన సిడి పొరపాటున రమ్య తన బాగ్ లో పెట్టుకోవడం తో ఆ సాక్ష్యం మాకు లభించింది.మనోహరే హంతకుడని తెలిసినా ఫింగర్ ప్రింట్స్ నిపుణులతో చెక్ చేయించి మనోహర్ ను అరెస్ట్ చేయించాను.”

హర్ష ధ్వానాల మధ్యబాలి అందరికీ అభివాదం చేస్తే ..

ఏసిపి శాండిల్య షేక్ హ్యాండిచ్చి హగ్ చేసుకున్నాడు *




గత నలభై ఎనిమిది గంటలలో జలజ జీవితం లో అత్యంత దుర్భరమయిన దినాలు. ఆమెకి జరిగినదంతా తలుచుకుంటూ ఉంటె తెరలు తెరలు గా దుఃఖం వస్తూనే ఉంది.

*****

ఆమె భర్త ప్రభుత్వం లో చాలా సీనియర్ ఆఫీసర్. ప్రస్తుతం ఒక ముఖ్యమయిన శాఖకు మంత్రిగా ఉన్న తమ కులస్థుడి వద్దే సెక్రెటరీ గా చేస్తున్నాడు.     రెండు మూడు జిల్లాలలో అతను కలెక్టర్ గా పనిచేసినప్పుడు ఆమె మహారాణి లా గడిపింది. జిల్లాలో జరిగిన అనేక ముఖ్య సమావేశాలకు భర్త తో పాటు ఆమె ని కూడా పిలిచి, సన్మానించేవారు. ఏవయినా పోటీలు జరిగితే బహుమతులు అవీ ఈవిడ చేతే ఇప్పించేవారు. జిల్లా అధికారి గా పని చేసిన రోజులు ప్రతీ సివిల్ సర్వీసు అఫీసర్ కి చాలా ఆనందించే సమయం. యువకులుగా ఉన్నప్పుడే జిల్లా అధికారిగా నియమిస్తారు. మంచి ఆశయాలతో, అవినీతి లేకుండా ప్రజల సమస్యలు తీర్చి మంచి పేరుప్రఖ్యాతులు గడించడం మామూలే. కానీ అసలు కథ ఆ నియామకం కాలం గడిచిన తరువాత ప్రమోషన్ మీద డిపార్టుమెంటల్ హెడ్స్ గానూ, కొన్ని శాఖలకు అధిపతులగానూ నియమింప బడిన తరువాత ప్రారంభ మవుతుంది .

జిల్లాలో ఉన్న వైభవం హెడ్ క్వార్టర్స్ లో ఉండదు. అప్పుడు వాళ్ళు రాజకీయ నాయకుల కను సన్నలలో పనిచేయాలి. మంత్రి మారగానే, తన శాఖ లో ఉన్న సెక్రటరీలని మార్చేయడం తరచూ జరుగుతుంది. తనకి కావలసిన పనులు అడ్డు లేకుండా చేయించుకోవడానికి, సాధారణంగా ఆ మంత్రులు తమ కులస్తుణ్ణి తెచ్చుకుని వ్యవహారం నడుపుతారు. ఇది దృష్టి లో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం సర్వీసులలో సెలెక్ట్ చేసుకున్న తరువాత చాలా మటుకు ఆఫీసర్లని వారి స్వరాష్ట్రం లో కాకుండా ఇతర రాష్ట్రాలలో వేస్తారు. చాలా మంది ఇలాటి వారే ఉంటారు సెక్రటరీలు గా. కాని ప్రతి శాఖలోనూ ప్రిన్సిపాల్ సెక్రటరీ లే కాకుండా మిగతా వాళ్లు కూడా ఉంటారు. జాయింట్ సెక్రటరీ, డెప్యూటీ సెక్రటరీ లాటి వాళ్ళు రాష్ట్రం సర్వీసులో రిక్రూట్ అయి ప్రమోషన్లమీద ఉన్నత పదవులకు వస్తారు. ఇలాటి వాళ్ళు ముఖ్యం గా రాజకీయ ప్రాబల్యం తో ఎదుగుతారు.

రాజకీయ వేత్తలు మారగానే వీళ్ళని కూడా, కుల, రాజకీయ ప్రాతిపదిక మీద మంత్రులు మార్చు కుంటూ ఉంటారు. మంత్రిగారి అడుగులకు మడుగులొత్తే ఆఫీసర్లు అందరూ స్వకులస్తులే అనుకోనక్కరలే. అవినీతి కి అలవాటు పడిన ఆఫీసర్ ఏ రాష్ట్రం వాడయినా కొందరు మంత్రులు చేర తీస్తారు. ఇలా సెక్రటరీలని మార్చడం అవినీతి కోసమే అనుకోనక్కరలేదు. కొందరు మంత్రులు ప్రజాసేవ నిజాయితీ గా చేయ దలచుకున్నప్పుడు, మచ్చ లేని ఆఫీసర్లని తెచ్చుకుని నియమించుకుంటారు.

జలజ భర్త జిల్లాలో పనిచేసినప్పుడు మంచి పేరే తెచ్చుకున్నాడు. కాని సెక్రటరీ హోదా లో రాజధాని కి వచ్చిన తరువాత మడి కట్టుకోవడం మానేశాడు. స్వామి కార్యం తో పాటు, స్వకార్యం కూడా చేసుకుంటూ అడ్డంగా సంపాదించాడు. అలా సంపాదించేవాళ్ల జీవన శైలికీ , వాళ్ళకి ఉద్యోగపరంగా వచ్చే ఆదాయానికి సరిపడే జీవన శైలి కీ చాలా తేడా ఉటుంది. ఖరీదయిన , కార్లు, అపార్టుమెంట్లూ, ప్రీమియర్ క్లబ్స్ లో సభ్యత్వాలూ, నగలూ, ఒక స్థాయి దాటిన తరువాత బినామీ ఆస్తులు, దేశంలో అనేక చోట్ల లాకర్లూ - ఇలా ఊపిరి తీసుకోకుండా పరుగెడుతూనే ఉంటారు.

జలజ భర్త విషయంలో కూడా అదే జరిగింది. తమ కులానికి బలం ఉన్న పార్టీ అధికారం లోకి రాగానే, జలజ భర్తని ఓ ముఖ్య శాఖకు అధిపతిగా ఉన్న అదే కులానికి చెందిన మంత్రి తన దగ్గరికి, శాఖ మార్పించి తెచ్చుకున్నాడు. అదే కులానికి చెందిన ఇతర మంత్రులు, అవినీతికి దూరంగా కొంత మంచి పని చేయడానికి ప్రయత్నిస్తుంటే, ఈయన మాత్రం మళ్ళీ అవకాశం రాక పోవచ్చని, తాను మంత్రి అవడానికి ఖర్చుపెట్టిన డబ్బు, మళ్ళీ ఎన్నికలకి కావలసిన డబ్బు సమకూర్చుకోవడం కోసం ఎన్ని చేయాలో అన్నీ చేశాడు. జలజ భర్త కూడా ఉడుకు రక్తం చల్లారిన తరువాత మిగతా సహ ఉద్యోగుల్ని చూసిబాగా సంపాదించాడు.

రెండు రోజుల క్రితం మామూలుగానే తెల్ల వారింది. జలజ వాళ్ళు ఉంటున్నది ఒక గేటెడ్ కమ్యూనిటీ కాంప్లెక్స్ లో విల్లా. కాంప్లెక్స్ లో అందరూ సీనియర్ ఆఫీసర్లూ, వ్యాపారవేత్తలూ విల్లాలు కొనుక్కున్నారు . ఉదయాన్నే సెక్యూరిటీ వాడు ఫోన్ చేశాడు. చాలా గవర్నమెంట్ వాహనాలు తమ విల్లా వైపు వస్తున్నాయని. జలజ హడావిడి గా భర్తని లేపింది. అంత క్రితం రోజే క్యాంపు నుంచి వచ్చి లేటు గా పడుకున్నాడు. అతను లేచి బట్టలు వేసుకోగానే బిల బిల మంటూ ఇన్కమ్ టాక్స్ వాళ్ళూ,

అవినీతి శాఖ వాళ్లూ ఒకే మాటు విరుచుకు పడ్డారు. ఇల్లంతా తిరగదోడి, డబ్బూ, కాగితాలూ అన్నీ ఒక చోట చేర్చడం, జలజ భర్త ని ఏవో అడిగి సంతకాలు చేయించు కోవడం జరుగుతూ ఉండగా, టీవీ లో బ్రేకింగ్ న్యూస్లు, స్క్రోలింగ్ న్యూస్ లో ప్రారంభం అయ్యాయి. ఇంటిముందు కాంప్లెక్స్ లో జనం, పబ్లిక్ జనం మూగారు. మధ్యాహ్ననికి, కొన్ని ఆధారాలు చూపించి అరెస్ట్ చేసి తీసుకు పోయారు.

ఇంత గొడవలోనూ ఒక మాటు లోపలికి వచ్చి జలజ తో భర్త మెల్లగా మాట్లాడాడు. వీళ్ళకి దొరికింది చాలా తక్కువని, బినామీ పత్రాలూ అవీ వాళ్లకి దొరకనంతకాలం వర్రీ లేదని, ఏ లాకర్లు ఎక్కడ ఉన్నాయో వాళ్ళకి తెలియదనీ ధైర్యం చెప్పాడు. దీని లో తన మంత్రి మీద ఎదో రాజకీయ కుట్ర జరుగుతోందని, అతని గురించి వివరాలకోసం, కాగితాల కోసం. తన ఆఫీసు కూడా చెక్ చేస్తారనీ చెప్పాడు. కానీ సాయంత్రానికి అరెస్ట్ చేసి తీసుకు పోయారు. ఇన్నాళ్లు కూడ బెట్టినదంతా ఒక్క మాటు పోయిందని ఇద్దరూ మనసులో చాలా మధన పడ్డారు. అరెస్ట్ చేసి తీసుకు వెళ్లేముందు భార్య తో మాట్లాడడానికి సమయం తీసుకుని, తాను వెళ్లిన తరువాత ఏమి చేయాలో అన్నీ వివరం గా చెప్పాడు. ముందు అదే ఊళ్ళో ఉన్న ఆమె చెల్లెలినీ , భర్త నీ వచ్చి సాయంగా ఉండమని కోరామన్నాడు . గతంలో ఇలాగ రైడ్ లో పెట్టుబడి బయట పడిన ఆఫీసర్ల ఫోన్ నంబర్లు ఇచ్చి ఎలా బయట పడాలో కనుక్కోమన్నాడు. ఎంత ఖర్చు అవుతుందో కూడా వివరంగా కనుక్కోమన్నాడు. జలజ కూడా చదువుకున్నదే కాబట్టి ఆ సమాచారం సంపాయిస్తుందన్న ధైర్యం అతనికి ఉంది.

******

గత రెండు రోజులలోనూ భర్త చెప్పిన ఆఫీసర్ల ను కలుసుకుని, వాళ్ళు చెప్పిన అడ్వకేట్లను కలిసి చేయవలిసిన వన్నీ చేసింది. అడ్వొకేట్లు చెప్పినది ఏమిటంటే ఇది తప్పని సరిగా ఎవరో వెనుక ఉండి చేయించినదే అయి ఉంటుందన్నారు . ఆ వెనుక ఉన్నది ఏ స్థాయి వాళ్ళు అన్నదాని బట్టి ఖర్చుఉంటుందని తేల్చారు. ఎన్నాళ్ల లో బైలు దొరుకుతుందన్నది కూడా దాని బట్టి ఉంటుందని, ఖర్చు చేస్తే జరగనిది లేదనీ ధైర్యం చెప్పారు. మూడో రోజు మధ్యాహ్నం ఆమె చెల్లెలి భర్త కనుక్కుని వచ్చి చెప్పాడు. ఆ సాయంత్రం జలజ వెళ్లి ఆయనని జైలులో కలవ వచ్చని చెప్పాడు.

ఈ రెండు రోజులూ జైలులో ఎలా గడుపుతున్నాడో అన్న ఆలోచనలతో ఆమె చాలా బాధ పడింది. ఎప్పుడూ ఖరీదయిన ఆహారానికి అలవాటు పడిన అతను జైలు లో ఎలాంటి ఫుడ్ పెడతారో ఏమిటో అని చాలా బాధ పడింది. డబ్బుతో జరగనిది లేదని ఆమెకు తెలియదు. సాయంత్రం డ్రైవర్ ని రమ్మని, ఎక్కడికి వెళ్ళాలో ఏమిటో అన్నీ మరిది ని కనుక్కుని బయలుదేరింది. దారిలో పుల్లారెడ్డి షాప్ కనపడగానే డ్రైవర్ ని ఆపమని చెప్పి లోపలికి వెళ్ళింది. కొద్దిగా నయినా తన భర్త ఇష్ట పడే స్వీట్ తీసుకు వెళ్లాలనిపించింది ఆమెకి. మరీ పెద్ద గా పాకెట్ ఉంటె జైలులో అందరి దృష్టి పడుతుందని ఒక రెండు వందల గ్రాములు పేక్ చేయమంది. వాళ్ళు మామూలుగా వాళ్ళ షాపు పేరు కనపడే పేక్ లో ఇచ్చారు. ఆ లేబుల్ జైలులో బయటికి కనపడటం ఆమెకి ఇష్టం లేక, కౌంటర్ లో ఉన్న వ్యక్తిని ఒక న్యూస్ పేపర్ ఇమ్మంది. అతను వెనక్కి తిరిగి అక్కడ రేక్ లోంచి ఒకే పాత పేపర్ తీసి

ఇచ్చాడు. పైన దుమ్ము ఉందని లోపలి పేపర్ తీసుకుని స్వీట్ పేకెట్ చుట్టూ చుట్టి పట్టుకు వెళ్ళింది.

జైలులో ఆమె ఊహించిన దానికంటే చాలా బాగుంది. సినిమాలలో చూపించినట్టు గా లేదు. ఆమెని ఒక్కత్తినే కలవడానికి ఏర్పాటు జరిగింది. భర్త కూడా అంత డీలా పడిపోయి లేడు. ఆమె ద్వారా లాయర్లు చెప్పింది విన్న తరువాత, మళ్ళీ కొన్ని ఆదేశాలు ఇచ్చాడు. ఆమెకి. మంత్రి తో టచ్ లో ఉన్నాననీ, త్వరలో బయట పడి కేసు నిఎదుర్కొంటానని ధైర్యం చెప్పాడు. కాసేపు మాట్లాడుకున్న తరువాత జలజకి తాను తెచ్చిన స్వీట్ గుర్తుకు వచ్చి అతనికి ఇచ్చింది. ఏమిటి ఇది అంటూ పేపర్ తీసి లోపల స్వీట్ చూసి నవ్వి, "ఈ గొడవలో ఇది నీకు గుర్తు ఎక్కడుంది?" స్వీట్ నోట్లో వేసుకుని చేతిలో ఉన్న పేపర్ పక్కన పెడుతూ అన్నాడు. పేపర్ పక్కన పెడుతున్న క్షణం లో అతని దృష్టి ఆ పేపర్ లో వచ్చిన ఒక అవినీతి కేసు కథనం బొమ్మలతో కనపడగానే చేతిలోకి మళ్ళీ తీసుకుని పైకి చదివాడు. భార్య కూడా వింటుందని

అందులో కథనం ఒక చిన్న తరగతి ఇంజనీర్ గురించి. అవినీతి శాఖ వారు ఒక ఇరవయి వేలు లంచం తీసుకుంటూ ఉండగా పట్టుబడిన ఉదంతం. అతను అవమానం భరించలేక ఆ సాయంత్రమే ఆత్మా హత్య చేసుకున్న సంఘటన ఫోటోల తో సహా వేశారు. వ్యాస కర్త సంగ్రహించిన కొన్ని అభిప్రాయాలు కూడా అందులో ప్రచురించారు. చాలా మంది అతని మీద సానుభూతి తో గౌరవం గా మాట్లాడారు. కోట్లు తో పట్టుబడిన ఆఫీసర్లు, కాంట్రాక్టర్లూ, ప్రజలలోనూ, బంధువర్గం లోనూ ఇలా పట్టుబడినప్పుడు జరిగిన అవమానం పట్టించు కోకుండా, అక్రమం గా సంపాదించిన డబ్బుని సేవ్ చేసుకోవడంలోనూ, జడ్జీలకు కూడా లంచం ఇవ్వడానికి ప్రణాళికలు వేశే వాళ్లతో పోలిస్తే ఆ చనిపోయిన ఇంజినీరు చాలా ఉత్తమ మయిన వాడని సాబునుభూతి గా మాట్లాడారు. అంటే అవినీతి కేసులో పట్టుబడిన వాళ్ళు ఆత్మా హత్య చేసుకోవాలని మీ ఉద్దేశ్యమా? అని విలేకరి ప్రశ్నించిన దానికి వాళ్ళు ఆ ఉద్దేశ్యం కాదనీ, కానీ అలాచేయడం సమాజం లో పరువు ప్రతిష్టలకు ఇచ్చే ప్రాధాన్యత ని చూపుతుందనీ చెప్పి, సమాజం లో పరువు ప్రతిష్టలను ఏమాత్రం పట్టించుకోకుండా అలా అవమానం జరిగినా ఏ మాత్రం మారని వాళ్ళు కూడా ఉండడం ఆశ్చర్య మని చెప్పారు

అది చదవాదం పూర్తి అవగానే ఇద్దరూ ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకరు చూస్తూ ఉండిపోయారు. అతని చేతిలో స్వీట్ కింద పడిపోయింది




ఉదయం 6గంటలకు ఫోను మోగడం తో బద్ధకం గా పడుకున్న మాధవ రావుకు మెలుకువ వచ్చింది. ఈ టైము లో ఎవరబ్బా అనుకుంటూ శ్రీమతి వంటింట్లో ఉండటం తో తప్పక తనే లేచి ఫోన్ తీసాడు.అవతల ఆయన ప్రాణమిత్రుడు రామారావు అమెరికా నుంచి."ఏమిటిరా? ఇంత ప్రొద్దున్నే చేసావు.?" అని అడిగాడు.

"అవన్నీ నేను వచ్చాక చెబుతాను కాని ముందు మా ఇంట్లో అద్దెకున్నవారిని ఖాళీ చెయ్యమని చెప్పి, ఇల్లు శుభ్రం చేయించు.. మేము 1,2 నెలల్లో వచ్చేస్తాము" అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

ఏమిటో ఇంత హఠాత్తుగా వస్తానంటున్నాడు అని ఆలోచిస్తూ కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ టిఫిను ముగించుకొని నాలుగిళ్ళ అవతల ఉన్న రామారావు ఇంటికి వెళ్ళాడు. ఆళ్ళతో పరిచయం ఉండటం తో విషయం చెప్పి ఆ మాట ఈ మాట మాట్లాడి ఇంటికి వచ్చి భోజనం చేసి నడుము వాల్చాడు. రామారావు గురించి ఆలోచించ సాగాడు.

++++++++++++++++++

రామారావు పంచాయితీరాజ్ లో ఏఇ గా చేసి రిటైరు అయ్యి నాలుగేళ్ళు అవుతోంది.ట్రాన్స్ఫర్లతో అక్కడక్కడ తిరిగినా ఈ కాలనీలోనే ఉన్న సొంత ఇంట్లో స్థిరపడ్డాడు.రెండేళ్ళు బాగానే ఉన్నాడు.ఒకరోజు షడన్ గా వచ్చి పిల్లలు వాళ్ళ దగ్గరకు వచ్చి ఉండమని గొడవ చేస్తున్నరు వెళుతున్నామురా అని చెప్పాడు.రామారావుకి ఇద్దరు కొడుకులు.పెద్దవాడు ఢిల్లీ లో ఉన్నతోద్యోగం లో ఉన్నాడు.చిన్నవాడు అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీరు.కోడళ్ళు కూడ ఉద్యోగాలే .ఇద్దరికీ ఇద్దరేసి పిల్లలు.చిన్న కొడుకు రెండో పిల్లాడు డేకేర్ కు వెళుతున్నాడు కాని మిగిలిన ముగ్గురు స్కూల్కి వెళుతున్నారు.వారం పదిరోజుల్లోనే పెద్ద వస్తువులన్నీ అమ్మేసి మిగిలిన వాటిని ఒక గదిలో వేసి తాళం పెట్టి మాధవరావుకి ఇచ్చి వెళ్ళిపోయాడు.అలా వెళ్ళినవాడు ఇదిగో ఇప్పుడే ఇలా ఫోన్ చెయ్యడం.

అద్దెవాళ్ళు ఖాళీ చేయడం తో మాధవరావు వాళ్ళ పని అమ్మాయితో ఇల్లంతా శుభ్రం చేయించి సామాను సర్దించి వచ్చాడు.చెప్పినట్లుగానే మరుసటి నెలలోనే రామారావు దంపతులు వచ్చారు.బడలిక తీర్చుకోవడం ,అన్నీ అమర్చుకోవడానికి వారం పదిరోజులు పట్టింది.కాస్త తీరిక దొరికాక మిత్రులిద్దరూ కాలనీలోని పార్కులో కూర్చున్నారు.పిచ్చాపాటి మాటలయ్యాక,"ఇప్పుడు చెప్పరా ఏమి జరిగిందో ?"అని అడిగాడు మాధవరావు.

"ఏమి చెప్పనురా?"అని దీర్ఘం గా ఒక ంట్టూర్పు విడిచాడు రామారావు.

"పిల్లల దగ్గరే ఉండిపోతామని వెళ్ళారుగా!ఎందుకు అర్ధాంతరంగా వచ్చేసారు."

"వృధ్ధాప్యం లో మా అమ్మానాన్న మా దగ్గరే ఉండటం నీకు తెలుసుగా"

"తెలుసు.అయితే?"

"వాళ్ళకు నేనొక్కడినే కొడుకుని.మా చెల్లెళ్ళు ఇద్దరు ఉన్నా మధ్యలో ఒక వారం వెళ్ళినా ఇక్కడే ఉండేవారు.నడవ గలిగిన రోజుల్లో దగ్గర్లోని గుడికి వెళ్ళేవారు.అక్కడ ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ ఉండేది.మా పిల్లలు కూడా ఖాళీ సమయాల్లో వారి దగ్గర చేరేవారు.కాశీమజిలీ కధలు,రామాయణ,మహాభారత ,పంచతంత్రము ఇవన్నీ నిద్ర పోయే వరకు చెప్పించుకునేవారు.మా బంధువులు కూడా చుట్టు పక్కల ఊళ్ళలో ఉండటం తో వచ్చి పోతూ ఉండేవారు.మీ చెల్లెలు కూడా వాళ్ళతో కబుర్లు చెప్పేది.ఒంటరితనం వాళ్ళను ఎప్పుడూ బాధించ లేదు.చివరి వరకు ఆనందం గా గడిపారు."

"ఇప్పుడు ఆ సొద అంతా ఎందుకురా?నువ్వెందుకు వచ్చావని నేను అడుగుతుంటే!"

"అక్కడకే వస్తున్నా ! మేము పిల్లల దగ్గర ఉందామని వెళ్ళామా?పెద్దాడు ఢిల్లీ.పెద్ద నగరం.రెండోవాడు అమెరికా. కొడుకులు,కొడళ్ళు నలుగురూ ఉద్Yఓగాలు.చెప్పుకోవడానికి చాలా బాగుంటుంది.మనవళ్ళు స్కూల్స్.చిన్న మనవడు కి రెండేళ్ళే!వాడిని ఇంట్లో ఉంచమన్నా అలవాటు తప్పుతుందని డే కేర్ కి పంపిస్తారు.ప్రొద్దున 7.30-8.00 గంటల మధ్య వెళితే సాయంకాలం వచ్చేటప్పటికి 6.00-6.30 అవుతుంది.రాగానే ఆరోజు డిన్నర్ మర్నాటికి రెడీ చేసుకోవడం ,ఉదయమే లేవాలని 9.00 గంటల కల్లా పడుకుంటారు.మాకేమో నిద్ర పట్టదు.టివి పెట్టుకుందామంటే వాళ్ళకి డిస్టర్బెన్స్. కొంచెం ముందు వస్తారు కాని వాళ్ళ హోం వర్క్ చేసుకోవడం,ఏ కొంచెం సమయమున్నా టాబ్లెట్ లలో గేంస్ ఆడుకోవడంతో సరిపోతుంది.శని,ఆదివారాల్లో పిల్లల్ని డాన్స్,సంగీతం,డ్రాయింగ్,కరాటే,స్విమ్మింగ్ అంటూ ఏవో క్లాసులకు తిప్పుతూనే ఉంటారు.పిల్లలు మాట్లాడే ఇంగ్లీషు మాకు అర్ధం కాదు.రోజంతా నాలుగైదు పొడి మాటలు తప్ప మిగతా సమయమంతా మౌనవ్రతమే.చేయడానికి పని ఉండదు.వాళ్ళే పొద్దున్నే చేసుకొని బాక్సులు పట్టుకు వెళతారు.లేదంటే బయట తెచ్చుకు తింటారు.అవి మాకు పడవు.మీ చెల్లెలు చేసేవి వాళ్ళకు నచ్చవు.వాళ్ళు తీసుకొని వెళితే తప్ప ఎక్కడకీ వెళ్ళలేము.బంధువులు ఎవరూ కనిపించరు.ఇందులో వారిని తప్పు పట్టే పనిలేదు.ఇప్పటి పిల్లల పోకడ అలా ఉన్నది.అందరితో పోటీ పడాలనే తపనే వాళ్ళను అలా తయారు చేస్తోంది.ఇక అక్కడ ఇమడ లేమని వచేసామురా!"

"మంచి పని చేసారురా!మీ అమ్మానాన్నల అప్పటి పరిస్థితులు వేరు.ఈ బిజి లైఫ్ వేరు.పదవీ విరమణ చేయగానే పిల్లల దగ్గరకు వెళ్ళి ఉండక్కరలేదు.ప్రశాంతం గా జీవించడానికి ఎన్ని దారులు లేవు.మన లాంటి ఎంతోమంది ఈ పార్కుకు వస్తూ ఉంటారు.దగ్గర్లో గుఇదింగ్ ఉన్నది,లైబ్రరీ ఉన్నది.నువ్వు ఇప్పటి వరకు ఉన్న బిజి తో ఖరచి పోయిన హాబీలను ఇప్పుడు నెరవేర్చుకో! మీ బంధువులు వచ్చి వెళుతుంటారు.అనుబంధాలకు,ఆత్మీయతలకు పిల్లలు పరిస్థితుల వల్ల దూరం అవుతున్నారు.మనం చేజేతులా దూరం చేసుకోవడం ఎందుకు.ఎప్పుడో ఒకసారి ఫోన్ లో హలో అనే కంటే కలసి మాట్లాడుకోవడం లోని ఆనందం నీకు నేను చెప్పక్కర లేదు.ఇక్కడ మీఅంతట మీరు ఎక్కడకైనా వెళ్ళి రాగలరు.ఏ మాత్రం ఓపికున్నా స్వతంత్రం గా జీవించడం లోని ఆనందం ఇంకొకరి మీద ఆధారపడినప్పుడు ఉండదు.అది పిల్లలైనా సరే!మరీ కదలలేని పరిస్థితి వచ్చినప్పుడు ఇంకొకరి మీద ఆధారపడక తప్పదు. నువ్వే ఆలోచించు."

"నిజమేరా నువ్వు చెప్పింది.నువ్వు ముందు చూపుతో చెప్పిన దానిని నేను అనుభవం తో కాని గ్రహించలేకపోయాను.ఇది మనలాంటి వారందరూ తెలుసుకోగలగాలి."

"పోనీలే ఇప్పటికన్నా తెలుసుకున్నావు.సంతోషం".

ఈద్దరూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు బయలుదేరారు.




సురేష్ మరియు విగ్నేష్ సముద్ర తీరం మట్టిలో కష్టపడి నడిచి వెడుతున్నారు.

సముద్ర తీరంలో బండ్ల మీద అమ్ముతున్న ఎండు చేపల వాసనను విగ్నేష్ భరించలేకపోయాడు. ముక్కు మూసుకుని, ఊపిరి బిగపెట్టి, చిదరింపు ముఖంతో తన ఎత్తైన పొట్టతోనూ, బరువైన శరీరంతోనూ నడవలేక అవస్తపడుతున్న విగ్నేష్ ను చూసి మనసులోనే నవ్వుకుంటూ అతని వెనకే నడిచాడు సురేష్.

దూరంగా మొదలవుతున్న సముద్రంలోని అలలు ఎగిసి పడుతూ వేగంగా తీర ప్రాంతాన్ని తాకుతున్నాయి. అలా వేగంగా వస్తున్న అలలను సైతం గమనించకుండా మాటల్లో మునిగిపోయిన ప్రేమ జంటలను దాటుకుంటూ నడుస్తున్నారు ఇద్దరూ.

"ఒక రోజైనా ఏనుగు తలతో రాకుడదు" సముద్రపు గాలికి చెదిరిపోతున్న జుట్టును సరిచేసుకుంటూ విగ్నేష్ ని అడిగాడు సురెష్.

"నువ్వు నా స్నేహితుడివి. మనిషైన నీతో సన్నిహితంగా మాట్లాడాలంటే ఈ మనిషి రూపమే సరైనది. నా నిజమైన రూపంతో

వచ్చి, ఒక విప్లవం ఏర్పరచి, జనాన్ని నా పక్కకు తిప్పుకోవటం నాకు ఇష్టం లేదు" చెప్పాడు విగ్నేష్.

"అదీ కరక్టే! మానవ రూపంలో వచ్చావు కాబట్టే నీతో సరిసమానంగా మాట్లాడగలుగుతున్నాను"

"ఇక నడవలేను. ఇక్కడ కూర్చుందాం" చెప్పాడు విగ్నేష్. ఇద్దరూ అక్కడ మట్టిలో కూర్చున్నారు.

బీచ్ అంతా ప్రజా సందడితో కోలాహళంగా ఉంది. అలలతో వెళ్ళి, వాటితోనే తిరిగి వస్తున్న యువకులు. పిల్లల చేతులు పుచ్చుకుని సముద్ర తీరం నీటిలో నిలబడ్డ తండ్రులు. ఇసుకలో ఇళ్ళు కట్టి, అలలు వచ్చి వాటిని కొట్టుకుని పోతుంటే ఆనంద పడుతున్న పిల్లలు. కాళ్ళు మాత్రమే తడేసే విధంగా నడిచి వెడుతున్న యంగ్ గరల్స్. తమతో తీసుకు వచ్చిన వస్తువులను కాపాడుకోవాటానికి వాటికి దగ్గరగా కాపలాకు కూర్చున్న మహిళలు...ఇలా ప్రజా సమూహంతో నిండిపోయున్నది ఆ సముద్ర తీరం."నువ్వు నాతో పాటు ఇంత సావకాశంగా కూర్చుని మాట్లాడి చాలా రోజులయ్యింది తెలుసా?" విగ్నేష్ ను చూసి అన్నాడు సురేష్.

"నిజమే...కానీ దానికి నేను కారణం కాదు. నువ్వే కారణం. నువ్వు ప్రతి రోజూ 'వాక్ ఇన్ ఇంటర్ వ్యూ' ఎక్కడ జరుగుతున్నాయో...అక్కడికి వెడుతున్నావు! అందరూ ఇంటర్ వ్యూ, పరీక్షలు లాంటి వాటికి వెళ్ళేటప్పుడు నా దగ్గరకొచ్చి కొబ్బరికాయ కొట్టి ప్రార్ధన చేసుకుంటారు. నువ్వేంట్రా అంటే...ఇంటర్ వ్యూ లంటూ, వాటికోసం నిన్ను నువ్వు తయారుచేసుకోవటంలో పడి కనీసం నన్ను తలుచుకునే టైము కూడా లేకుండా తిరుగుతున్నావు" చెప్పాడు విగ్నేష్.

"నీ దయతో నేను సెలెక్ట్ అయితే, అది ప్రతిభ లేని వాడికి రెకమండేషన్ లాగా అయిపోతుంది. నేను నీకు కొబ్బరికాయ కొడతానని మొక్కుకుంటే...దానికి పేరు లంచం! ఏ విజిలన్స్ వారు నిన్ను పట్టుకోలేరు. నా మేధస్సును, నా మార్కులను నమ్ముకుని ఇంటర్ వ్యూ లకు వెడుతున్నాను"

"ఏం ప్రయోజనం? ఒక్క ఉద్యోగానికి కూడా సెలెక్ట్ అవలేక పోయావే?"

"అందుకని...నీ కాళ్ళకు మొక్కి, నీకు లంచం ఇస్తానని ప్రామిస్ చేస్తేనే నేను సెలెక్ట్ అవుతానా?" కోపంగా అడిగాడు సురేష్.

“కోపగించుకోకు సురేష్!...సరదాగా నిన్ను కవ్వించి చూశాను. రేపు జరగబోయే ‘వాక్ ఇన్ ఇంటర్ వ్యూ’ లో నువ్వు సెలెక్ట్ కావాలని నేను విష్ చేస్తున్నాను"

"రేయ్ సురేష్...లేవరా! ఇంటర్ వ్యూ కి వెళ్ళాలని చెప్పావుగా! టైమవుతోంది...లేవరా..." తల్లి గొంతు లోతైన బావిలో నుండి వినబడుతున్నట్టు అనిపించడంతో విఘ్నేష్ మరియు బీచ్ సురేష్ కళ్ళ (కల) నుండి చెదిరిపోయాయి. సురేష్ కళ్ళు తెరిచి చూశాడు. వంట గదిలోని మసాలా వాసనతో తల్లి అరుపులు వచ్చి చేరుతున్నాయి.

"లేచాను" తల్లికి వినిపించేలా గట్టిగా అరుస్తూ పక్క మీద నుండి లేచాడు సురేష్. గోడ గడియారం ఎనిమిది గంటలా ఐదు నిమిషాలు చూపిస్తోంది. దాని పక్కనున్న మేకుకు వేలాడదీసున్న వినాయకుని క్యాలండర్ గాలికి అటూ, ఇటూ ఆడుతోంది.

కొన్ని రోజుల ముందువరకు ఆ మేకుకు పార్వతీ-పరమేశ్వరుల క్యాలండర్ తగిలించి ఉంచాడు సురేష్. అంతకు ముందు...అంటే కొన్ని సంవత్సరాల క్రితం అదే మేకుకు వెంకటేశ్వర స్వామి క్యాలండర్ ఉండేది. ఆ క్యాలండర్ బాగా పాతబడిపోయి, రంగులు మారిపోయి, చిరుగుతున్న దసలో ఆ క్యాలండర్ తీసేసి ఆంజనేయ స్వామి, శితారాములు, లక్ష్మీ దేవి, సరస్వతీ దేవి క్యాలండర్లు చోటుచేసుకున్నాయి. అందరు దేవుళ్ళూ సురేష్ను ఆశీర్వదిస్తునే ఉన్నారు.

ఇప్పుడున్న వినాయకుని క్యాలండర్ను సురేష్ స్నేహితుడు మురళి ఇచ్చాడు. వినాయకుడి క్యాలండర్ వచ్చిన తరువాత, అప్పటి వరకు సరాసరి విధ్యార్ధిగా ఉన్న సురేష్ డిగ్రీ పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకుని పాసయ్యాడు. అందుకనే వినాయకుని క్యాలండర్ పాతబడిపోయినా ఆ క్యాలండర్ ను తీసేయకుండా అక్కడే ఉంచాడు.

"తండ్రీ విఘ్నేశ్వరా...నువ్వెప్పుడూ నాకు తోడుండాలి" మనసులోనే ప్రార్ధించుకుంటూ గబగబా పళ్ళుతోముకుని, స్నానం చేసి, టిఫిన్ తిని ‘వాక్ ఇన్ ఇంటర్ వ్యూ’ కు బయలుదేరాడు.

కలలో వచ్చిన వినాయకుడు తనతోనే ఉన్నాడన్న బ్రమ సురేష్ కు ఏర్పడింది. ఇంటర్ వ్యూ కు వచ్చిన మిగిలిన క్యాండిడేట్ల కంటే వినాయకుని ఆశిస్సులు తనకే ఎక్కువగా ఉందనే గర్వంతో హుందాగా, ధైర్యంగా కూర్చున్నాడు.

కానీ ‘వాక్ ఇన్ ఇంటర్ వ్యూ’ లో సురేష్ ఓడిపోయాడు.

"రాత్రంతా వినాయకుడు కలలో వచ్చాడని ఎంతో నమ్మకంగా ఉన్నాను...అంతా వృధా అయ్యిందే" అంటూ గొణుక్కుంటూ ఇంటికి బయలుదేరిన సురేష్ ఇళ్ళు చేరగానే మొదటి పనిగా తన గదిలోని వినాయకుని క్యాలండర్ను ఊడదీసి, చుట్టచుట్టి మంచం క్రింద ఉన్న పెట్టేలో పడేశాడు. మంచం మీద విరక్తిగా పడ్డాడు. కలలో వచ్చిన విఘ్నేశ్వరుడు...నిజ జీవితంలో తనని పట్టించుకోవటం లేదని మదన పడ్డాడు.

"ఇప్పుడే వచ్చాడు...అంతలో నిద్ర పోయాడు" తల్లి ఎవరితోనో చెప్పటం వినిపించింది.

"ఎవరో వచ్చారు! ఎవరితోనూ మాట్లాడే పరిస్థితిలో లేను" అనే నిర్ణయానికి వచ్చిన సురేష్ పక్కనున్న దుప్పటి లాక్కుని మొహం నిండా కప్పుకుని ముసుగు తన్నాడు. "ఇంకా ఎన్ని ఇంటర్ వ్యూ లలో ఇలా ఓటమిని ఎదుర్కోవాలి?" అని అనిపించడంతో సురేష్ మనసు భారమైంది. గొంతుక అడ్డుపడింది...కళ్ళల్లో నీళ్ళు పొంగినై.

"ఈ ఉద్యోగం రాకపోతే ఇంకో ఉద్యోగం! ఇంటర్ వ్యూ కు వెళ్ళొశ్తేనే ఇంతే...ఏదో జీవితమే పోయినట్లు డీలా పడిపోతాడు. ముసుగు తన్ని పడుకుంటాడు. నువ్వైనా వాడికి కొంచం ధైర్యం చెప్పు" అనే తల్లి మాటలతో పాటూ ఎవరో తన గదికి వచ్చారని గ్రహించాడు సురేష్.

"సురేష్... సురేష్...రేయ్ సురేష్" స్నేహితుడు జాన్సన్ పిలుపు!....ముఖం వరకు కప్పుకున్న దుప్పటిని తీసేసి లేచి కూర్చున్నాడు సురేష్.

"సురేష్...బాధ పడకు! మా కంపెనీలో ఖాలీలున్నాయి. వెంటనే అప్లై చెయ్యి" అన్నాడు జాన్సన్.

"మీ కంపెనీలో చేరాలంటే ఇంగ్లీష్ నాలెడ్జ్ బాగా ఉండాలి కదా...నాకు అంత లేదే"

"నాకున్న ఇంగ్లీష్ నాలెడ్జ్ చూసి నాకే ఉద్యోగం ఇచ్చారు...నీకేం తక్కువరా? నా కన్నా నీకు ఇంగ్లీష్ నాలడ్జ్ ఎక్కువే...అప్లై చెయ్యి, ఆ దేవుడు నీకు అన్యాయం చేయడు.తప్పకుండా ఉద్యోగం వస్తుంది" నమ్మకాన్ని అందించాడు.

జాన్సన్ చెప్పినట్లే దేవుడు సురేష్ కి అన్యాయం చేయలేదని సురేష్ నమ్మాడు. కారణం జాన్సన్ పనిచేస్తున్న కంపెనీలో సురేష్ కి

ఉద్యోగం దొరికింది.  మంచం క్రింద నుండి చుట్టచుట్టి పడేసిన వినాయకుని క్యాలండర్ తీసి మళ్ళీ మేకుకు తగిలించాడు సురేష్. ఆనందంగా ఉద్యోగాని వెళ్ళి వస్తున్నాడు సురేష్. అలాగే కొన్ని రోజులు గడిచినై.

సడన్ గా ఒక రోజు సురేష్ కలలో దేవుడు ప్రత్యక్షమయ్యేడు. కొన్ని వేలమంది మధ్యలో ఎత్తైన్ స్టేజి పైన ఆయన నిలబడి ఉన్నాడు. చేతిలోని పన్నీరు సీసాలోని జలాన్ని అందరిపైనా జల్లాడు.  దూరంగా నిలబడున్న సురేష్ మీద కూడా ఆ జలం చుక్కలు పడ్డాయి.

ఈ కల గురించి జాన్సన్ కి చెప్పినప్పుడు "దేవుడి ఆశిస్సులు నీకు ఉన్నాయి రా...అందుకే నీకు కలలో అలా కనిపించాడు" చెప్పాడు జాన్సన్.

వినాయకుని క్యాలండర్ పక్కన ఇప్పుడు ఏసు ప్రభువు క్యాలండర్ కూడా తగిలించాడు. రోజూ నిద్ర లేచిన వెంటనే రెండు క్యాలండర్లకూ దన్నం పెట్టుకుంటున్నాడు సురేష్.

*****

అలారం మోత సురేష్ కు చిరాకు తెప్పించింది. విసుగుతో దాన్ని ఆపాడు. దుప్పట్లో నుండి బయటకు రావడానికి ఇష్టపడలేదు.

మంచి జీతం, మర్యాద. రోజులు బాగానే గడిచినై...ఎవరి దిష్టి తగిలిందో ఎమో...ఒక రోజు అన్నీ తలకిందులుగా మారినై.....మళ్ళీ ఉద్యోగ వేట మొదలుకు వచ్చింది! నిద్ర పట్టక చిరాకుగా అటూ ఇటూ దొర్లుతున్న సురేష్ కు గిన్నెల మోత వినిపించింది. తండ్రి భోజనం చేస్తున్నాడు. తల్లి వడ్డిస్తోందని గ్రహించాడు.

"సురేష్ ను ఏమీ తిట్టకు! వాడు లేచినప్పుడే లేవని. విధి వాడితో ఆటలాడుకుంటోంది. వాడేం చేశ్తాడు పాపం"...తండ్రి మాటలు సురేష్ ను ఇంకా బాధకు గురిచేసినై.

"ఇలా నన్ను అర్ధం చేసుకునే తల్లితండ్రులకు నేను తిరిగి ఏంచేయగలనో...నాతో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగి హత్య చేయబడ్డ కారణంగా నన్ను అరెస్టు చేయడం...ఉద్యోగంలో నుండి తీసేయడం ఏ విధంగా న్యాయం? తరువాత నిజమైన హంతకుడు దొరికినందువలన నన్ను విడిచిపెట్టారు. కాని నాకొచ్చిన చెడ్డ పేరు తొలగిపోతుందా ఏమిటి?...లంచం ఇచ్చి పనిలో

చేరాడు...పై అధికారులను బుట్టలో వేసుకుని తన పని సాధించుకున్నాడు...అన్నారు" వేదనతో సురేష్ మనసు భారమయ్యింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

పడుకో బుద్ది కాలేదు...దుప్పటి తొలగించుకుని లేచాడు. గోడకు తగిలించున్న దేవుళ్ళ ఫోటోలను చూడటానికే ఇష్టంలేదు. దుప్పటి మడతపెడుతూ "వాళ్ళేం చేయగలరు...నాకు టైము సరిగ్గా లేదు!" మనసులోనే అనుకుంటూ మెల్లగా స్నానాల గదివైపు నడిచాడు.

మళ్ళీ ఉద్యోగ వేట మొదలుపెట్టి, దానికోసం తిరిగి తిరిగి విసుగు పుట్టింది. సమయం గడపటానికి లైబ్రరీకి వెళ్ళటం మొదలు పెట్టాడు. ఉద్యోగ అవకాశల వార్తలను పేపర్లలో చదువుతూ, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కూడా చదివేడు...దానితో పాటు స్వీయ నమ్మకం పెంచే పుస్తకాలు కూడా చదివాడు.

ఆ పుస్తకాలు చదివిన తరువాత ఒక రోజు "నేను ఏదైనా సాధించగలను" అని ఒక తెల్ల కాగితంపైన పెద్ద అక్షరాలతో రాసుకున్నాడు. దాన్ని ఒక అట్టపై అతికించాడు. దేవుళ్ళ ఫోటోలకు మధ్య దాన్ని తగిలించాడు.

"ఏమండీ...సురేష్ ఇప్పుడు చాలా మారిపోయాడు. ఏవేవో పరీక్షలకు చదువుతున్నాడు. స్కూల్లో ఉన్నప్పుడూ, కాలేజీలో చదువుకునేటప్పుడు కూడా వాడు ఇలా గంటల తరబడి చదువుకోలేదండి" సురేష్ లో వచ్చిన మార్పును భర్తతో చెప్పింది సురేష్ తల్లి.

“నేనూ గమనించాను...వాడి ఆలొచనలే ఇప్పుడు చాలా స్పష్టంగా ఉన్నాయి" భార్యతో అంగీకరించాడు సురేష్ తండ్రి.

సురేష్ యొక్క కఠిన శ్రమ అతన్ని ఐ.ఏ.ఎస్ పరీక్షలలో విజయం సాధించేట్లు చేసింది.

“మనసులో నమ్మకం ఉంటే ఏది కావాలనుకుంటే అది దొరుకుతుంది. ఏది అనుకుంటే అది జరుగుతుంది" అనే విషయాన్ని తన అనుభవంలో తెలుసుకున్నాడు సురేష్.

*********

ఆ రోజు నిద్ర పోతున్నప్పుడు సురేష్ కు కలలో దేవుళ్ళు కనిపించారు.

అదే బీచ్...అదే గాలి.

"ఇప్పుడంతా మమ్మల్ని మరచిపోయావు కదా?...ఇప్పుడు నువ్వు సాధించిన విజయానికి కారణం మేమే...తెలుసా?" అన్నారు.

"అబద్ధం...నేను చదివిన పుస్తకాలు నా మేదస్సును పెంచినై. నా విజయానికి కారణం అదే. మాయలు చేసే మిమ్మల్ని ఇంక నమ్మదలచుకోలేదు" చెప్పాడు సురేష్.

"ఉద్యోగాలు వెతికి వెతికి అలసిపోయిన నీకు మంచి ఉద్యోగం దొరికేటట్లు చేసేమే...మరచిపోయావా?"

"నేను ఎవరిని నమ్మదలచుకోలేదు. నన్ను మాత్రమే నమ్ముతున్నాను. ఏదైనా సాధించగలను అనే మనో ధైర్యం నా దగ్గరుంది...ఇక మీరు కధలు చెప్పకండి"

"నీలో మనో ధైర్యం అనే శక్తిగా ఉన్నది మేమే".....మాటలు గంభీరంగా వినబడ్డాయి. ఆ శబ్ధానికి నిద్రలేచాడు. అటూ ఇటూ చూశాడు. కానీ ఏ రూపాన్నీ క్లియర్ గా చూడలేకపోయాడు.

"...."

"మనో ధైర్యం పేరుతో నీ మనసులో ఒక భాగంగా ఉండేది దేవుళ్ళే" ఇప్పుడు మాటలు అతనిలో నుండే వినబడ్డాయి.

సురేష్ గబుక్కున లేచాడు. తల విధిలించుకున్నాడు. “కలా ఇది? కాదు...నిజంగానే ఎవరో మాట్లాడినట్లు ఉన్నదే!” ..... గోడవైపు చూశాడు. మేకుకు తగిలించిన అతని రాతలు కనిపించినై. తాను లైబ్రరీలో చదివిన ఒక పుస్తకంలోని వాఖ్యాలు గుర్తుకు వచ్చినై.

"మనసుకు అనంతమైన శక్తి ఉన్నది. దానితో అద్భుతాలు సృష్టించవచ్చు. మనసే శరీరాన్ని నడిపిస్తోంది. రోజువారి అవసరాలకు ప్రత్యేకించి మనసు అవసరం లేదు. ఎందుకంటే ఆ పనులకు అలవాటు పడిన మనసు వాటిని అలవోకగా చేస్తుంది. కానీ సృజనాత్మకమైన పనులు చేయాలంటే, మనసులో కొత్త కోణాలు ఆవిష్కృతం కావాలి. ఉపయోగించుకోవడానికే మనసు ఉన్నా, మనిషికి ఆ పద్ధతి తెలియదు.

అద్భుతమైన పనులు సాగించాలంటే, మనిషి మనసులో నూతన ఆలోచనలు రావాలి. నిత్యం తనను తాను పరిశీలించుకొనేవారికి మనసు చేస్తున్న పని అవగాహనకు వస్తుంది.ప్రతి పనీ మనసు అధీనంలోనే సాగుతుంది. మనసు అధీనంలో మనిషి ఉంటాడు. అతడు తన మనసులోని శక్తినంతా ఆత్మాన్వేషణ వైపు మళ్లిస్తేనే, మనసును సరిగ్గా ఉపయోగించుకున్నట్లు లెక్క. నేను ఏదైనా సాధించగలను అనే నమ్మకాన్ని మనసులోకి బీజంగా నెట్టి, దానికీ రోజూ శ్రమ అనే నీటిని పోస్తే నువ్వు ఏదైనా సాధించగలవు"

"ఇదంతా (కలలు కూడా) మనసు పనే!"....హాయిగా నవ్వుకున్నాడు సురేష్.




సాయంత్రం జనరల్ షిఫ్ట్ నుంచి ఇంటి కొచ్చి నాన్న పక్కన కూర్చుని కాఫీ తాగుతూ చెప్పాను.

"నాన్నా ! రేపు మా ఛానల్ కి రచయిత్రి భార్గవీ రావ్ వస్తోంది. నన్ను ఇంటర్వ్యూ చెయ్యమన్నారు. నాకిష్టం లేదు. మరో యాంకర్ కివ్వమని చెప్పాను . కానీ మా హెడ్ మీరే చెయ్యండి అన్నారు తప్పదు."

"భార్గవీ రావు గారా ? ఇంటర్వ్యూ చెయ్యడానికి నీకెందుకూ అభ్యంతరం ? నిన్నేం చేసిందావిడ ? చెయ్యి "అన్నారు నవ్వుతూ నాన్న.

భోజనం చేశాక భార్గవీ రావు గారి వివరాలున్న కాగితం తీశాను. పాతికేళ్ళ నుంచి యాభై నవలలూ, రెండొందల కధలూ రాసిందావిడ. ఆవిడ రాసిన కొన్ని ప్రేమ కధలూ, బహుమతి పొందిన కధల సినాప్సిస్ లూ ఓ గంట చదివి పక్కన పెట్టాను.

అన్నిట్లోనూ ప్రేమ ప్రధాన వస్తువు. అందుకే ఆమెకు "ప్రేమ భార్గవి " అని బిరుదు ఇచ్చారట అభిమానులు. ఆవిడ గృహిణి . భర్త వ్యాపారి. ఇద్దరు పిల్లలు.

పడుకునే ముందు మా క్రియేటివ్ హెడ్ డేవిడ్ గారన్న మాట గుర్తొచ్చింది. "మరో యాంకర్ కివ్వమంటున్నారెందుకు ? ఆవిడ మీ యువతకు ఆరాధ్య రచయిత్రి కదా ! "అని.

"నాకు కాదు సర్ ! మా చెల్లి లాంటి టీనేజర్స్ కి, ఎక్స్ పోజర్ లేని వాళ్ళకి , ప్రపంచం తెలిని వాళ్ళకి. అసలి భార్గవీ రావు లాంటి వాళ్ళకి ఇంటర్వ్యూ లిచ్చే స్థాయి లేదు సర్ ! "అన్నాను ఆ వేశంగా. ఆ మాటకి "ఓవర్ మె చ్యూ రిటీ కూడా మంచిది కాదు విద్యా ! డూ యువర్ డ్యూటీ !" అన్నారాయన క్లుప్తంగా .

ఆయనకి నా తెలివితేటల మీద గౌరవం ఉన్నా ఒకోసారి నేను అతి చేస్తానని ఆయన అంతర్యం. నేను మాట్లాడకుండా తలూపి వచ్చేసాను.

ఆయన మా యాంకర్ లకి చెబుతూ ఉంటారు. ఇంటర్వ్యూ ఇస్తున్న వ్యక్తి చెప్పేది అభిమానం తో చక్కగా వినాలి. వారి నుంచి ప్రేక్షకులకి ఓ సందేశం రాబట్టాలి. మనమే విసుగూ, నిర్లక్ష్యం చూపిస్తే చూసే వాళ్ళకు ఇంట్రెస్ట్ ఎలా కలుగుతుంది? వివిధ రంగాల్లో కృషి చేసి పేరు సంపాదించుకున్న వారిని ప్రజలకు పరిచయం చెయ్యాలి.అందులో పక్షపాతం ఉండకూడదు. మనం చేసే పనిలో మనం నిజాయితీగా ఉండాలి. వచ్చిన గెస్ట్ లకు గౌరవం ఇచ్చి మన గౌరవం మనం నిలుపుకోవాలి. ఇలా సాగుతాయి సర్ మాటలు .

వ్యక్తి గత ఇంటర్వ్యూ లకి నేను వ్యతిరేకి నేమీ కాను. ఒక విధంగా ఆ పని చేసి చేసీ ఇలా అయ్యానేమో కూడా ! నిజంగా చాలా సత్తా ఉన్న వాళ్ళని పరిచయం చేసే అవకాశం వస్తే ఎంతో సంబర పడతాను. అదృష్టం గా భావిస్తాను. వాళ్ళెంతో సహజంగా ఉంటారు.

తగినంత    ప్రతిభ లేని వాళ్ళు కూడా ఒకోసారి అదృష్ట వశాత్తూ పేరు ప్రఖ్యాతులు గడిస్తారు. వాళ్ళ ముఖా ముఖీల్లో గొప్ప హిపోక్రసీ కనబడుతుంది.

ఇలా వి ఐ పీ లయి పోయిన చాలా మంది మతలబీలుగా కూడా మారిపోతారు. అబద్దాలు చెప్పి, చెప్పి    ఏది నిజమో ఏది అబద్ధమో తెలీని స్థితి కి చేరుకొని ఉంటారు. ఆయా రంగాల్లో పైకి రావడానికి వారు పడిన కష్టాలూ, కన్నీళ్ళూ    దాచి పెట్టి తాము నిద్ర పోతుంటే ఎవరో లేపి తమని కళాకారుల్ని చేసేసారంటారు. మేము పుట్టడమే ప్రతిభా వంతులుగా పుట్టా మంటారు. ఇలాంటి అసత్యపు ఇంటర్ వ్యూ ల వల్ల ఎవరికీ ఉపయోగం ఉండడం లేదనేదే నా బాధ.

*****

మర్నాడు పొద్దున్నే లేచి కిటికీ దగ్గర నిలబడ్డాను. పక్కింట్లో ఓ చుడీదార్ పిల్ల పూలు కోస్తోంది. నాకు వెంటనే చెల్లాయి రాజీ గుర్తొచ్చింది. తను కూడా ఈ పిల్ల లాగే మంచి మంచి డ్రెస్ లు వేసుకుని గెంతుతూ ఉండేది. సినిమాల పిచ్చి బాగా ఉండేది. టెన్త్ ఫెయిల్ అయ్యి నవలలూ, మాగ జైన్ లు చదువుతూ స్నేహితుల నేసుకుని సినిమా థియేటర్ లకు పోతూ ఉండేది. అవన్నీ సిల్లీ ప్రేమ కథల సినిమాలే !

నాకు పదేళ్ళప్పుడే అమ్మ అనారోగ్యం తో చని పోయింది. నాన్నకూ నాకూ రాజీ అంటే గారం. మేము హయత్ నగర్ దాటి లోపల ఒక కాలనీ లో ఉండే వాళ్ళం. చుట్టూ గ్రామీణ వాతావరణం ఉండేది.    నాన్న ఓ చిన్నపాటి దిన పత్రిక లో తగు మాత్రపు జీతంతో సంసారం నడుపుతూ వచ్చారు. ఈ మధ్యే రిటైరయ్యి

వచ్చిన కొద్ది మొత్తం సొమ్ము బ్యాంకు లో వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. రాజీ పుస్తకాల, సినిమాల పిచ్చితో మునిగి తేలుతుండేది. నేను అందంగా ఉన్నాను కాబట్టి నన్ను పెళ్లి చేసుకోవడానికి ఎవరో రాజ కుమారుడు అమెరికా నుంచి వస్తాడనుకునేది. నేను డిగ్రీ చదివి జర్నలిజం పీ జీ చేస్తుంటే తను హాయిగా ఇంట్లో టీ.వీ. చూస్తూ రక రకాల వార పత్రికలూ, సినిమా మాగజైన్ లూ కాలనీ లైబ్రరీ నుంచి తెచ్చి చదువుతూ ఉండేది.

" ఏదో ఒక పుస్తకం అని చదవకు. చదవాల్సినవి    ఈ పత్రికలు కాదు. మంచి సాహితీ విలువలున్న కథలూ, నవలలూ చదువు. గొప్ప గొప్ప సినిమాలున్నాయి. పేర్లు చెబుతాను అవి చూడు. కానీ ఈ పిచ్చి ప్రేమ కథలున్న సినిమాలు చూడకు " అనేదాన్ని .

"ఏడుపులూ, కష్టాలంటే పడదు నాకు. మా యూత్ కోసం తీసిన సినిమాలే బావుంటాయి నాకు "అనేది,

నా మా ట కొట్టి పారేస్తూ.

రాజీకి అభిమాన రచయిత్రి ఈ భార్గవీ రావే . ఈవిడ పుస్తకాలే ఎక్కువగా లైబ్రరీ నుంచి తెచ్చి చదివేది. నేను ఒకటి రెండు సార్లు చదవడానికి ప్రయత్నించి వి సుగేసి ఆపేశాను. థీమ్ లు ముందు మాటల్లో తెలుసుకున్నాను. నాకు అర్ధమైనంత వరకు అవన్నీ అర్ధం పర్ధం లేని ప్రేమ కధలు. తమ పొలం లో పని చెయ్యడానికి వచ్చిన యువకుడిని ప్రేమించి అది చెప్పలేక పెద్ద వాళ్ళు చేసిన పెళ్లి వద్దని పిచ్చి పిల్లగా మారిన ఓ అమ్మాయి కధ ఓ నవల.

మరో నవలలో ప్రేమ సఫలం కాలేదని బ్రహ్మచారిణిగా ఉం డి పోయి ఊరి కందరికీ సహాయాలు చేసే టీచర్ కధ. ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకోవడానికి ఇంట్లోంచి పారిపోయి సినిమా హీరోయిన్ లయిన వాళ్ళూ, కోటీశ్వరుల కోడ ళ్ళయిన వాళ్ళూ ఇవీ పాత్రలు.

"ఇవేం నవలలే ? జీవితం ఇంత ఈజీ గా ఉండదు. ఎంతో కష్ట పడాలి. సులువుగా ఏదీ రాదు.మనుషులు ఈ కధల్లోలా ఉండరు. ఆవిడెలా రాస్తుందో ! నువ్వెలా చదువుతావో ! నాకర్ధం కాదు. అన్నానొకసారి చెల్లి మీద కేక లేస్తూ.

"నువ్వో జడ పదార్ధానివి. నీకు రంగూ, రుచి, వాసనా లేని జీవితం అంటే ఇష్టం. నాకలా కాదు. అయినా నా భవిష్యత్తు నేను చూసుకో గలను. నీది నువ్వు చూసుకో ! చాలు ! " అంది రాజీ అసహనంగా.

అనడమే కాదు. తన భవిష్యత్తుని తనే నిర్ణయించుకుని మా పక్కింటి కుర్రాడితో వెళ్లి పోయింది. వాడు ఇంటర్ ఫెయిల్ అయ్యి ఏవో కంప్యూటర్ కోర్స్ లు చేస్తూ ఓ రూంలో ఉండే వాడు. అతన్ని పెళ్లి చేసేసుకుని ఫోన్ చేసి చెప్పింది.

నాన్నా, నేనూ ఏడుస్తూ పరిగెత్తాం నల్గొండకి. ఓ చిన్న గదీ, కిచెన్ ఉన్న పోర్షన్ లో ఉన్నారిద్దరూ.

"ఇతనేం పోషిస్తాడు నిన్ను? ఏం చూసి చేసుకున్నావ్ ?" అని ఏడుస్తూ అడిగాను.

"ఇతనికి చాలా ఆస్తి ఉంది.కొన్ని రోజులయ్యాక తల్లి తండ్రుల్ని ఒప్పించి తీసుకు వెళ్తాడు వాళ్ళింటికి" అంది.ఆ అబ్బాయి ఒక్క మాట మాట్లాడలేదు. తలొంచుకుని నిలబడ్డాడు.

నాన్న మౌనంగా కుమిలిపోయారు తప్ప ఒక్క మాట కూడా అనలేదు రాజిని . నేనే పట్టరాని కోపం తో ఏవేవో తిట్టాను దాన్ని. నేనూ, నాన్నా తిరిగి వచ్చేసాం. ఆ రాత్రంతా నిద్ర పోకుండా ఏడ్చాను.

"చెల్లిని బలవంతం గానైనా తీసుకొచ్చేద్దాం నాన్నా ! మళ్ళీ వెళ్లి "అన్నాను మర్నాడు పొద్దున్నే ఉక్రోషంగా. "వద్దు లేమ్మా ! విజ్ఞత లేని వాళ్ళు ఇంకొకరి మాట వినరు. దాని బతుకు దానిష్టం. ఎవరి జీవిత సౌధానికి వాళ్లే ఆర్కిటెక్ట్ లంటారు కదా ! రాజీ లైఫ్ బావుండాలని ఆశిద్దాం అంతకంటే ఏమీ చెయ్యలేం "అన్నారు నాన్న. తర్వాత రాజి అప్పుడప్పుడూ ఫోన్ చేసి చెబుతూ ఉండేది వివరాలు. ఓ రోజు చెప్పింది. అతనికి ఆస్తి ఉండడం అబద్ధమట. ఒక అనాధ శరణాలయంలో పెరిగాడట.

నేను అవాక్కయ్యి "మరెలాగే ఇప్పుడు ? "అన్నాను.

"నా కోసం నా మీద ప్రేమతో అసత్యాలు చెప్పాడులే. ఏం లేకపోయినా అతనికి నా మీద నిజమైన ప్రేమయితే ఉంది. అది చాలదా అక్కా ? "అంది అమాయకంగా. నా గుండె తరుక్కు పోయింది. పిచ్చి పిల్ల ఎలా ఆలోచిస్తోందో అనిపించి బాగా ఏడ్చాను. నాన్న కీ సంగతి చెప్పగానే ప్రేమ గుడ్డిది అన్నారందుకే ! అదీ ఒకందుకు మంచిదేలే ! " అంటూ గట్టిగా నిట్టుర్చారు.

మరో రెండు నెలల తర్వాత ఇద్దరూ ఓ సూపర్ మార్కెట్ లో చేరి పని చేస్తున్నామని చెప్పింది. ఎప్పుడైనా వస్తూ ఉంటుంది.ఒక రోజుండి వెళ్లి పోతుంటుంది. అతనెప్పు డూ రాలేదు మా ఇంటికి. అసంతృప్తితో రాజి అతన్ని బాధపెట్టడం లేదు, ఇద్దరూ కలిసి కష్టపడుతున్నారు మంచిదే కదా అనుకున్నాం నాన్నా, నేనూ.

గతేడాది నా కొచ్చిన ఈ ఛానల్ యాంకరింగ్ జాబ్ లో నేను బిజీ అయ్యాను. ఈ ఛానల్ కొత్తది, అంతగా మార్కెటింగ్ లేనిది. మరో పెద్ద ఛానల్ కి వెళ్ళాలంటే రికమెండేషన్ లేదు. అయినా ప్రయత్నిస్తూ ఉన్నాను.

అప్పుడప్పుడూ నాన్నా నేనూ రాజికి ఫోన్లు చేస్తూ ఉంటాము. రాజి అతన్ని వదిలి వచ్చేసే రోజొకటి వస్తుందేమో, వచ్చాక దానికెక్కడైనా ఉద్యోగం చూడాలని నాకూ నాన్నకీ ఆశ ఉందింకా.

***

మర్నాడు మధ్యాహ్నం నాలుగు గంటలకి లైవ్ ఇంటర్వ్యూ కి ఏర్పాట్లు జరిగాయి. రచయిత్రి ప్రేమ భార్గవి రావ్ మూడున్నరకే వచ్చింది. వయసు యాభై పైనే ఉండొచ్చు. మొహం అమాయకంగా ఉంది. మానసిక పరిపక్వత లేకపోవడం వల్ల కావచ్చు అనుకున్నాను మనసులో.

ప్రోగ్రాం మొదలయ్యింది. నమస్కారాలయ్యాక ప్రఖ్యాత రచయిత్రి అయినందుకు ఆవిడను అభినందించి జీవిత విశేషాలు అడగడం మొదలు పెట్టి "ముందుగా మీ బాల్యం గురించి చెప్పండి " అన్నాను.

ఆమె తన చిన్నతనం గురించి ఆనందంగా వివరించడం మొదలు పెట్టింది. తను నిత్యం కథలూ, నవలలూ చదివే దాన్ననీ, ఆ ఇష్టం కొద్దీ టెన్త్ అయ్యాక కాలేజీ కి వెళ్ళలేదని క్లాస్ పుస్తకాలు తనకయిష్ట మనీ చెప్పింది. ' ఎంత అదృష్టమో !' అనుకున్నాను మనసులో. రచయిత్రి కావాలని తన జీవితాశయంగా పెట్టుకుని మరీ అయ్యానని గర్వంగా చెప్పింది.

" మీరు ప్రధానంగా ప్రేమను నవలా వస్తువుగా. కథా వస్తువుగా తీసుకుని రాసారు. మిమ్మల్ని ప్రేమ భార్గవి అంటారంతా ! ప్రేమ మీ అభిమాన సబ్జెక్టు ఎలా అయ్యింది ? " ప్రశ్నించాను.

"నా ఉద్దేశంలో ప్రేమ చాలా గొప్పది. విశ్వమంతా నిండి ఉంది ప్రేమే ! దాని వల్లనే ప్రపంచం నడుస్తోంది కదా ! " అంది నవ్వుతూ భార్గవి.

"యువతకి నచ్చే ప్రేమ గురించి చెప్పండి " అన్నాను. " ప్రతివారికీ జీవితంలో ఒక్క సారయినా ప్రేమానుభవం ఉంటుంది. అందుకే అందరికీ నాపుస్తకాలు నచ్చిఅభిమానిస్తారు " అంది తృప్తిగా

" మరి జీవితాల్ని వెలిగించే ప్రేమలే కాక ఆర్పేసే ప్రేమలు కూడా ఉంటాయేమో కదా ! వాటి సంగతేమిటి ? " అన్నాను కాస్త సీరియస్ గా

బిత్తర పోయిందామె. ఏ మనాలో తోచనట్టు కొన్ని సెకన్లు చూసి " ప్రేమను మించిన గొప్ప పదం లేదండీ అసలు " అంది చిలక పలుకులా.

"ప్రేమ గురించి ఇంత గొప్పగా రాస్తున్నారంటే దాని గురించి మీకు బాగా అవగాహన ఉండే ఉంటుంది. మీరు ఎవరినైనా

ప్రేమించారా !      ప్రేమించే ఉంటారు లేకపోతె ఇంట మధురంగా రాయలేరు " అన్నాను మొహమాట పెడుతూ.

ఆమె కొంచెం అనుమానించి "నేను హై స్కూల్ లో చదివే టప్పుడు మా ఎస్ పి యల్ పై నాకు      చాలా అభిమానం, ఇష్టం ఉండే వి . టెన్త్ అయ్యాక అతను మళ్ళీ కనబడలేదు"

“ మరి మీరు అతని కోసం వెతకలేదా ? అతని కోసం మీకు పిచ్చి ఎక్కడం లాంటివేమీ జరగ లేదా ?" ఆశ్చర్యం గా అడిగాను.

"అదంతా ఇన్ ఫా ట్యూ ఏ షన్ కదా ! మర్చి పోతాం " అంది నవ్వుతూ

" మరి పెళ్లి చేసుకునే టప్పుడు అతను గుర్తు రాలేదా ? బాధ పడలేదా ?" అడిగాను కుతూహలంగా.

" అబ్బే! అలాంటి దెందు కుంటుంది ? అది టీనేజ్ లవ్ అంతే !" అందామె నవ్వేస్తూ.

" మీరు మాత్రం మీ లవర్ ని హాయిగా మర్చి పోయి, పెళ్లి చేసుకుని మీ పేరు చివర భర్త పేరు తగిలించికుని ఆదర్శ గృహిణి అయిపోతారు . మీ నవలల్లో, కధల్లో ఆడ పిల్లలు పక్కింటి ఆవారా గాడిని, దొడ్లో పని చేసే పాలేర్నీ ప్రేమించి అతనితో వెళ్లి పోతారు. లేదంటే పిచ్చి వాళ్లయిపోయి ఊరిలో తిరుగుతూ ఉంటారు. అంటే వాళ్ళు మానసికంగా మీ అంత బలమైన వాళ్ళు కాదేమో కదా ! " అన్నాను వ్యంగ్యంగా .

కొంతసేపు మాట్లాడలేనట్టు గా ఉండిపోయి నెమ్మదిగా " కొందరలాంటి ప్రేమికులు ఉంటారండీ !" అంది భార్గవి చిన్నబుచ్చుకుంటూ.

" మీరు చూసారా ? ఊహించారా ! " అన్న నా ప్రశ్నకి బిత్తర పోయింది.

" ఆ ! అంటే విన్నాను " అంది నెమ్మదిగా

"విన్నవి     కాదు. జీవితాన్ని స్వయంగా చూసి రాయాలి. ఊహించి కాదు. మనం మాత్రం మన బతుకుల్ని జాగ్రత్తగా దిద్దుకుంటూ, అమాయకమైన యువతకి రంగుల కలలు అమ్ముతూ వారికి వక్ర మార్గాలు సూచించి     రాంగ్ గైడెన్స్ ఇచ్చి వారి జీవితాలు నాశనం చెయ్యకూడదు కదా !" అన్నాను

" అంత ప్రభావం సాహిత్యానికి ఉంటుందా ?" బలహీనంగా అందామె

" ఉంటుంది. సినిమా కాల్పనిక లోకం. కానీ కధలూ,నవలలూ జీవితాన్ని వివరించాలి. మన జీవితానుభవం తర్వాత తరానికి ఉపయోగపడాలి, ఆదర్శ వంతంగా ఉండాలి తప్ప వెర్రి మొర్రిగా ఉండకూడదు.

ఆమె నా వైపు అభావంగా చూస్తూ ఉండి పోయింది. నేను ఆవేశంగా మొదలు పెట్టాను.

“సబ్జక్టులు లేకపోతే, మీలో సృజన ఆగిపోతే రచనలు ఆపండి. ఎదగని బ్రెయిన్ తో అదే వస్తువు తో     మళ్ళీ మళ్ళీ రాయకండి. జీవితం అనేది ఓ లోతైన ప్రవహించే నది లాంటిది. దాని లోతుల్ని అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఆ క్రమంలో మీకు తెలిసిన సత్యాల్ని ఆవిష్కరించండి. రాయడాన్ని ఒక వ్యసనంగా చేసుకోకండి. ముందు తరం వారు రాసిన గొప్ప సాహిత్యాన్ని బాగా చదవండి. ఆకళింపు చేసుకోండి. ఆ తర్వాత మీకు నేనేదో చెప్పాలి అనిపిస్తే అప్పుడు రాయండి."

నా మాటలకి ఆమె మొహం పాలిపోయింది. మౌనం దాల్చింది. అది చూసిన నేనుకూడా కొన్ని సెకన్లు     పాజ్ ఇచ్చి " మా ప్రేక్షకులకి ఏదైనా మెసేజ్ ఇస్తారా ?" సౌమ్యంగా అడిగాను

ఆమె తల అడ్డంగా ఊపి నమస్కారం చేసింది. నేనామె చెయ్యి అందుకుని కలిపి,

"చాలా థాంక్సండీ ! మా స్టూడియో కొచ్చి చాలా మంచి విషయాలు చెప్పారు” అని ముగించాను

షూట్ చేస్తున్న వాళ్ళంతా షాక్ తిన్నట్టుగా ఉండి పోయారు. లైట్స్ ఆఫ్ చేసేసారు. ఎవరో వచ్చి ఆమెను డేవిడ్ గారి రూం కి తీసుకెళ్ళారు. నేను బాగ్ తీసుకుని ఇంటికి బయలు దేరాను. నాకు తెలుసు. రేపిపాటికి నా ఉద్యోగం ఊడినట్టు ఆర్డర్స్ రావడం ఖాయం. చెల్లిలిపై నాకున్న మమకారం బహుశా ఇలాంటి బాధ్యతా రహితమైన రచయితలపై కోపంగా మారిందేమో ! అది నన్ను

నా హద్దుల్ని దాటించి నా చేత అలా మాట్లా డించిందేమో ! ఆ రాత్రి కలత నిద్రే గతయ్యింది నాకు మర్నాడు ఆఫీసు కొచ్చి సీట్లో కూర్చోగానే అనుకున్నట్టుగానే, మా సీఈఓ నుంచి పిలుపొచ్చింది. ఒక్కసారి నిట్టూర్చి నిలబడి అందరి వైపూ చూసాను. ఈ రోజుతో ఈ ఛానల్ తో నా సహోద్యోగులందరితో ఋణం తీరి పోబోతోంది. భార్గవి దేవి గారితో ముఖా ముఖీ విద్యా మేడం గారిని ఇంటికి పంపుతోంది. విధి బలీయం అంటే ఇదే కదా !కెమెరా ముందు ఆవిడని నేను పెట్టిన హింసకి ఆవిడ నాకు శాపం పెట్టేసింది. శాప ఫలితం అనుభవించాలి తప్పదు' అనుకుంటూ వెళ్ళాను ఆయన రూం కి.

శ్రీ రామచంద్ర గారు సీరియస్ గా ఏదో చదువుతున్నారు. నెమ్మదిగా చప్పుడు కాకుండా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను. కొన్ని సెకను ల తర్వాత మరో ఫైల్ తీసి చదువుతూ తలెత్త కుండానే

" ఓ రచయిత్రి ని ఇంటర్వ్యూ చేస్తూ, రచయితలందరికీ నువ్వే సందేశం ఇచ్చావట కదా !" గంభీరంగా అన్నారు. నేను నేల చూపులు చూసాను.

ఆయనే మళ్ళీ " చాలా ఫోన్ లొచ్చాయి. నీ ముఖా ముఖీ విభిన్నంగా, వెరైటీ గా ఉందని." అని ఆగారు.

నేను నెమ్మదిగా తలెత్తాను ధైర్యం కూ డ దీసుకుంటూ.

" ఇప్పుడు నీకు మరింత బాధ్యత పెరిగింది. నీ సందేశం నీక్కూడా వర్తిస్తుంది. ఇంటర్వ్యూ కొచ్చే వాళ్ళని భయపెట్టకు "అన్నారాయన చిన్నగా నవ్వుతూ.

నెత్తి మీద మోస్తున్న బండరాయిని అమాంతం ఎవరో తీసేసి నట్టయింది. ఆనందాన్ని మింగేసి బైటికి నడిచాను గంభీరంగా.




ఆఫీసు అయిపోయాక బస్ కోసం ఆత్రంగా ఎదురుచూస్తూ నిలబడ్డ మధుని ,అతని స్నేహితుడు వేణు కలిసి ,హాయ్ మధు ,నీకోసం ఇప్పుడే ఇలా అనుకుంటున్నాను.అధృష్టవశాత్తు వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు భలే కనిపించావ్.చెప్పాడు ఉత్సాహంగా పల్లికిలిస్తూ.

అవునా ఇంతకీ ఎందుకట నా కోసం వెతకటంనేను నీకీవ్వాల్సిన డబ్బులు కూడా ఇచ్చేసానే.చెప్పాడు మధు ,ఆలోచిస్తున్నట్టు శూన్యంలోకి చూస్తూ .

అబ్బే అధికాదురా ,మొన్న నువ్విచ్చిన్నట్టే ,నేనూ ఈరోజు మా ఇంట్లో మన ఫ్రెండ్సందరికీ మాంచి పార్టీ ఇద్దామనుకుంటున్నాను.చెప్పాడు వేణు హుషారుగా.

అవునా.దేనికో అడిగాడు మధు,కొంచెం నీరసంగా.

ధేనికా,ఎప్పటినుండో పోరుతుంటే ,మా నాన్నగారు నిన్ననే హఠాత్తుగా ఓల్డ్ ఏజ్ హోంలో జాయిన్ అవ్వడానికి ఒప్పుకున్నారు.

దాంతో ఆయన్ని పొద్దున్నే అందులో పడేసి వచ్చేశాన్రా.దాంతో మా ఆవిడ చాలా హాపీగా ఉంది.కాకపోతే నాకే కొంచెం బాధగా ఉంది.ప్రతి నెలా మా నాన్న ఇచ్చే పెన్షన్ డబ్బు పోయిందే అని.చెప్పాడు కాస్త నిరాశ స్వరంతో.

అలాగా కాని నాకు పార్టీ కి రావడం కుదరదురా.చెప్పాడు మధు.

అదేం .ఎందుకని.పైగా మొన్ననే నువ్వు మీ నాన్నని ఓల్డ్ ఏజ్ హోం లో జాయిన్ చేసి అతని అడ్డంకి వదిలించుకున్నావుగా.అడిగాడు సందేహంగా.

లేదురా మళ్ళీ నేనే మా నాన్నని ఇంటికి తీసుకువచ్చేసాన్రా .ఛ ,చ .అన్నాడు మధు.

చిత్రంగా ఉందే .నువ్వే జాయిన్ చేసి మళ్ళీ నువ్వే తీసుకొచ్చేసావా .పోనిలే నాకాలంటి సెంటిమెంట్స్ ఏం లేవు.ఓ నవ్వు నవ్వాడు తేలిగ్గా.ఇంతలో తెల్లని లాల్చీ పైజమా వేసుకున్న ఓ పెద్దాయన మధుకి దగ్గరగా వచ్చి ,బాబూ మధూ ,పలకరించాడు చిన్నగా నవ్వుతూ.

అతన్ని చూసిన మధు ఓ క్షణంలోనే ముఖం మీదికి నవ్వు తెచ్చుకుని ,అరె అంకుల్ మీరా ఏంటీలా సడన్గా బస్ స్టాప్ లో ప్రత్యక్షమయ్యారు. ఎక్కడికైనా వెళుతున్నారా అడిగాడు మధు,ఆశ్చర్యంగా .

అవును మీ ఇంటికే వస్తున్నాను .చెప్పారు సదానందంగారు.

మా ఇంటికా .ఎప్పుడు మా నాన్నగారు రమ్మన్నా ఏదో పని ఉందనే వారు .బిజీగా ఉండేవారు.మరి ఇప్పుదేంటి ఇలా మీ అంతట మేరే రావాలనుకోవడం .ఏదైనా ముఖ్య విషయం చర్చించాలా మా నన్నతో , లేక మీ స్నేహితుడిపై హటాత్తుగా ప్రేమ పొంగిందా.అడిగాడు మధు చిరు నవ్వుతో.

రెండూ కాదయ్యా మధూ ,నిన్ను అభినందిచడానికే మీ ఇంటికి వస్తున్నాను.ఇంతలో నువ్వే కనబడ్డావు.చెప్పాడాయన మధు బుజం తడుతూ.నన్ను అభినందించడానికా ,దేనికంకుల్ .అమితాశ్చర్యంగా అడిగాడు.

మరీ అంత అమాయకంగా అడగకోయ్.నాకు తెలుసులే .మీ నాన్నని ఓల్డ్ ఏజ్ హోం లో జాయిన్ చేసినట్టే చేసి ,మళ్ళీ ఇంటికి తీసుకొచ్చేసావటగా .నువ్ గ్రేటయ్యా .చెప్పాడు అభినందనగా చూస్తూ.

మీరు అంటుంటే నాకూ గర్వంగానే ఉంది కానీ ,నేనేం నా అంతట నేను తీసుకురాలేదు.అసలు ఆయన్ని ఒల్డేజ్ హోంలో జాయిన్ చేసి ఫ్రెండ్స్ కి పార్టీ కూడా ఇచ్చాను.నేను పండగ చేసుకున్నాను.కానీ ఆ ఆనందం అంత త్వరగా ముక్కలౌతుందని మల్లె నేనే ఆయన్ని ఇంటికి తేవాల్సివస్తుందని నేనస్సలు అనుకోలేదు.చెప్పాడు అసహనంగా.

అదేంటయ్యా అలా అంటావ్ .అంత ఇష్టమ్ లేని వాడివి మీ నాన్నని ఆ హోం నుండి ఇంటికి ఎందుకు తెచ్చినట్టు ,ఇలా ఎందుకు బాధపడుతున్నట్టు.అడిగాడయన.

భలే వారే అంకుల్ నేనేం నా అంతట నేనుగా తీసుకురాలేదు .తప్పక తీసుకురావాల్సి రావడంతో తీసుకొచ్చాను.చెప్పాడు మధు నిట్టూరుస్తూ.

తప్పక తీసుకొచ్చావా.అంత తప్పక తీసుకు రావాల్సిన పరిస్థితి ఏమొచ్చింది.అడిగాడాయన వ్యంగ్యంగా.

ఏం చెప్పమంటారు మా నాన్నని ఆ ఓల్డ్ ఏజ్ హోం లో జాయిన్ చేసిన మూడో రోజే ,ఆయన అలవాటు ప్రకారం ఓ సిగరెట్ తాగి,పరాగ్గా దాన్ని విసిరేస్తే ,అది పరుపు మీద పడి పది వేల రూపాయిల పరుపు , దానితోపాటు డబుల్ కాట్ కాలిపోయిందట.పైగా అదే రోజు భోజనంలో నీసు వండలేదని కుక్ ని కుక్క అని తిట్టారట.దాంతో అతను కోపంలో పని మానేసి వెళ్లిపోబోయాడట.అలాగే సాయంత్రం టీలో చక్కెర తక్కువైందని ఆ టీ ని,ఇచ్చిన వాడి ముఖం మీద ,కప్పుని నేల మీద కొట్టారట .తర్వాత ఆ రాత్రికి టివి లో ఫ్యాషన్ చానల్ రావడం లేదని ఆ వార్డెన్ని పిచ్చి తిట్లు తిట్టి అన్నం తినలేదట.

అరెరె .అంటే ఆ పూట పస్తు పడుకున్నాడా మరి.అడిగారు సదానందం.

అదేం కాదు అంకుల్ .ఆ ఓల్డ్ ఏజ్ హోం లో పని చేసే కుర్రాడికి వంద ఎక్కువిచ్చి చికెన్ దమ్ బిర్యానీ తెప్పించుకు తిన్నారట.అసలే ఆ హోం లో మాంసాహారం నిషేదమట.అందుకే వాళ్ళు నాకు ఫోన్ చేసి ఇవన్నీ చెప్పి,వారు చెప్పిన టైమ్ లోపు తీసుకెళ్లకపోతే నా సంగతి చెప్తామన్నారు.పైగా మా నాన్న చేసిన నష్టానికి ఇరవై వేలు కట్టించుకున్నారు.పైగా వేరే ఏ హోం లోనూ ఈయన్ని జాయిన్ చేసుకోకూడదని, ఓల్డ్ ఏజ్ హోంల అసోషియేషన్కి రిఫర్ చేసిందట.దాంతో నేనే మా నాన్నని నేనే మళ్ళీ

కాళ్ళూ , గడ్డం పట్టుకుని ఇంటికి తెచ్చాను.చెప్పాడు మధు తల వాల్చేస్తూ.

అప్పటివరకూ ,అదంతా విన్న మధు ఫ్రెండ్ వేణు ,వెళ్తాను రా చెప్పాడు హడావుడిగా వెళ్లబోతూ.

ఏంటి తొందర .ఇప్పటివరకు ఉన్నవు ,విన్నావ్.ఇంతలోనే ఏమైంది.అడిగాడు మధు.

ఏం కాకూడదనేరా బాబూ .నువ్వు చెప్పింది విన్నాక నేనూ మా నాన్నని ఓల్డ్ ఏజ్ హోం నుండి తీసుకు రావాలాని డిసైడ్ అయ్యాను. అంతే.చెప్పాడు వేణు కొంచెం బిత్తర చూపులు చూస్తూ.

ఏడ్చినట్టే ఉంది.మా కొంచెం నాన్న కొంచెం చాదస్తం మనిషీ ,పైగా మొండి కూడా.కాబట్టి అలా చేశాడనుకుందాం.కానీ మీ నాన్న కూడా అలానే చేస్తాడని ఎందుకనుకుంటావు.

ఎందుకంటే ,ఆయన్ని కూడా మీ నాన్నని జాయిన్ చేసిన హోం లోనే జాయిన్ చేశారా మధూ.మా నాన్న మీ నాన్నని ఆదర్శంగా తీసుకోకముందే నేనే వెళ్తే మంచిదని .చెప్పి ఆటో పిలిచి డు ఎక్కాడు వేణు.అంతలోనే సదానందంగారు ఎక్కాల్సిన బస్ కూడా రావడంతో ,అంకుల్ మీరు మా ఇంటికి వెళ్ళి మా నాన్నగారితో మాట్లాడుతూ ఉండండి ,నేను దగ్గరలో సూపర్ మార్కెట్ కి వెళ్లొచేస్తాను.చెప్పి ఆయన్ని బస్ ఎక్కించాడు మధు.

మధు వాళ్ళింటికి చేరిన సదానందం గారు ,మూర్తి గారిని కల్సి ,ఆయన గురించి అతని సుపుత్రుడు మధు చెప్పిందంతా చెప్పి,నువ్విలా ఆ ఓల్డ్ ఏజ్ హోం లో రచ్చ చేయడం నాకేం నచ్చలేదురా మూర్తి.చెప్పారు సదానందం.

అతను చెప్పిందంతా విన్న మూర్తి గారు ,చిన్నగా చిరునవ్వు నవ్వేస్తూ,అదా! ఏం లేదురా సదానందం .అసలు విషయం ఏంటంటే , అలా అనాదలా ఓల్డ్ ఏజ్ హోం లో ఉండేందుకు వారానికే బాగా బెంగనిపించిందిరా నా మనుసుకి.ఈ వయసులో ప్రేమ,ఆప్యాతలకోసం ఏదో తెలియని తాపత్రయం.అలాగే నా మానవరాలితో ఆడుకోవాలని ,కోడలి చేతి కాఫి ,కొడుకుపై ఆ కొద్దిపాటి అజమాయిషీ చాలా,చాలా మిస్ అయినట్టు అనిపించిందిరా.కానీ నాకు ఇలా రాక రకాలుగా అనిపిస్తోందీ,బెంగగా ఉందీ ,నన్ను ఇక్కడినుండి దయచేసి ఇంటికి తీసుకెళ్ళరా అని వాడిని బ్రతిమాలడానికి నా అహం అడ్డొచ్చింది. వాదంతటి వాడే వచ్చి నన్ను తీసుకెళ్తే బావుండనిపించింది.కానీ ఆ వారం లో వాడు ఒక్కసారి కూడా ,నాన్న ఎలా ఉన్నావ్ అని ఓ ఫోన్ కాల్ కూడా చేయలేదు.అందుకే వాడంతటి వాడే నన్ను తీసుకెళ్లడానికి గాను ఈ ప్లాన్ వేశాను.చెప్పారు మూర్తిగారు చెమర్చిన కళ్ళతో,చిన్న

నవ్వుతో.

అవునా? నువ్వు చెప్పిందంతా బావుందిరా మూర్తీ .నీ గుండెల్లో బాధ కూడా అర్ధమైంది.కానీ నీ అవసరం నెరవేర్చుకోవడం కోసం ఆ హోం లోని మిగతా వారిని ఇబ్బంది పెట్టడం నాకు జీర్ణం కావడం లేదురా.మరే ఇతర ఆలోచనైనా చేయాల్సిందేమోరా .చెప్పారు సదానందం గారు కొంచెం తటపటాయిస్తూ .

ఓహ్ అదా! అని మళ్ళీ ఓ చిరు నవ్వు నవ్వి,అదంతా నిజం కాదురా సదా.మా వాడితో అలా చెప్పమని నేనే ఆ ఓల్డ్ ఏజ్ హోం వాళ్ళతో చెప్పమని చెప్పాన్రా. వారూ నా బాధ అర్ధం చేసుకుని అలాగే చెప్పి ,నేను ఇంటికి రావడానికి సహాయ పడ్డారు.చెప్పారు మూర్తిగారు.

అలాగా .మరి మీవాడు ఇరవై వేలు నష్టపరిహారం కట్టానన్నాడు.అడిగారు సదానందం గారు.

అదా.ఆ ఓల్డ్ ఏజ్ హోం లో మనలాంటి వారికి ఇంకొంతమందికి ఉపయోగపడుతుందని ,నేనే వాళ్ళకి ఆ ఐడియా ఇచ్చాను.మొదట ఒప్పుకోకపోయినా ,తర్వాత ఒప్పుకున్నారు.ఆ డబ్బు నా తరుపన డొనేషన్ గా స్వీకరించి ఉపయోగించమన్నాను.ఇప్పుడు చెప్పవోయ్ ఎలా ఉందో నా ప్లాన్ .మళ్ళీ మా అబ్బాయి నన్ను నే పోయెవరుకు ఏ ఓల్డ్ ఏజ్ హోం లోనూ జాయిన్ చేయడు కదా.అంటూ పెద్దగా నవ్వేశారు కళ్ళజోడు సరిచేసుకుంటూ.ఇంత బాధని అంత పెద్ద నవ్వు మాటున దాచేయాలన్న ఆయన మనసుకి లోలోన హాట్స్ ఆఫ్ చెప్పారు సదానందంగారు.

అప్పుడే వచ్చి ,ఆ సంభాషణంతా విన్న మధు కళ్ళు చెమర్చక మానలేదు.బాధతో ,పశ్చాత్తాపంతో.




మంత్రి గారి చాంబర్ నుంచి బయటకు వచ్చిన రాఘవరావు గారికి చాలా నిరసంగా, అంతకు మించి నిరుత్సాహంగా ఉంది. ఎంతో ఆశపడి సచివాలయానికి వచ్చి, ఉత్తి చేతులతో ఊరికి తిరిగి వెళ్ళాలంటే బాధగా ఉంది. వెళ్ళాక, తన ఊరి వాళ్ళకు ఏమని సమాధానం చెప్పాలి? ఊరి సమస్యలకు ఇప్పట్లో పరిష్కారం దొరకదా? - ఇలా పరిపరి విధాల ఆలోచనలతో బుర్ర వేడెక్కడంతో టీ తాగుదామని కేంటీన్ వేపు నడిచారు.

రాఘవరావు గారిది వెంకటాపురం. ఆ ఊరి ఉన్నత పాఠశాలలో చాలా కాలం పాటు ఉపాధ్యాయులుగా పని చేసిన రాఘవరావు గారంటే, ఆ ఊరి వారందరికీ చాలా గౌరవం. ఇద్దరు అమ్మాయిలకు మంచి సంబంధాలు చూసి వివాహాలు చేసారు, ఆర్థికంగా పెద్ద అవసరాలు లేవు, కోట్లు వెనకెయ్యాలనే అత్యాశలు లేవు. అందువల్ల, ప్రశాంత జీవనం గడుపుదామని వాలంటరీ రిటైర్మెంటు తీసుకొన్నారు.

తానొకటి తలిస్తే, దైవమొకటి తలచిందన్నట్లు- ఆయన రిటైర్మెంటు తీసుకున్న సమయానికే పంచాయితీ ఎన్నికలు వచ్చాయి. ఊరిలో చాలా సమస్యలు ఉండడం మూలంగా చదువుకున్న వ్యక్తి, ఊరి పట్ల అవగాహన ఉన్న వ్యక్తి సర్పంచ్ అయితే మంచిదనే ఉద్దేశ్యంతో – గ్రామస్తులంతా కలిసి రాఘవరావు గారిని సర్పంచిగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తి లేకపోయినా, తన పట్ల, తన కుటుంబం పట్ల ఎంతో అభిమానం, గౌరవం చూపించే ఊరి ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో రాఘవరావు గారు ఆ ఊరి పెద్దల నిర్ణయానికి తలొగ్గారు.

సర్పంచి అయిన నాటి నుండి, ఊరి అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా ఎన్నో ప్రణాళికలు రచించారు. ఊరివారు కూడా తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. అయితే, చదువుకున్న యువకులంతా ఉన్నత చదువుల కోసమో, ఉద్యోగాల కోసమో పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లిపోవడంతో పెద్దవయసు వారే ఆ ఊర్లో అధికంగా ఉన్నారు. దాంతో, అనుకున్న కార్యక్రమాలన్నీ వాస్తవ రూపం దాల్చడం కష్టంగా ఉంటోంది. రైతాంగం ఎక్కువగా ఉండే ఆ ఊరిలో ప్రస్తుతం తాగునీరు, సాగునీరు లభ్యమవటం ప్రధాన సమస్యగా మారింది. ఒకప్పుడు పచ్చని పొలాలతో, మంచి నీటి చెరువులు, బావులతో ఏ విధమైన ఇబ్బందిని ఎదుర్కోని ఆ ఊరికి నేడు వేసవి వచ్చిందంటే గుక్కెడు మంచినీళ్ళకి కూడా కటకట. ఈ సమస్యకు పరిష్కారం కోసం వెదుకుతూ, ఏమైనా పథకాల పరంగా సాయం చేస్తాడేమోనని, ఆ ఊరివారికి దూరపు బంధువైన పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దగ్గరకు వచ్చారు. అయితే, అన్ని ఊళ్లలో ఇదే సమస్య ఉందని, ప్రస్తుతానికి ఏ రకమైన సహాయం చేయలేనని తేల్చేసి, భవిష్యత్తులో ఆ ఊరి గురించి తప్పక ఆలోచిస్తానని ఒక శుష్క వాగ్దానం చేసి, రాఘవరావు గారిని సాగనంపాడు మంత్రిగారు.

గంపెడాశతో వచ్చిన రాఘవరావు గారికి ఇప్పుడు ఏమీ పాలుపోవటం లేదు, అలాగని అక్కడ ఉండి చేసేదేమీ లేదు. తిరిగి వెళ్ళాల్సిన బస్సు రాత్రి పది గంటలకు, అంతవరకూ ఎక్కడో కాలక్షేపం చేస్తే చాలు అనుకుంటూ, టీ తాగుతున్న రాఘవరావు గారి దృష్టి అక్కడ కట్టిన ఒక బ్యానర్ పై పడింది. "సచివాలయ సారస్వత వేదిక ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం కార్యక్రమం" - సాయంత్రం 4 గంటలకు – తనకు బస్సుకు చాలా సమయం ఉండడం, ఆసక్తికరమైన కార్యక్రమం కావడంతో, రాఘవరావు గారు ఆ కార్యక్రమం చూసి వెళ్దామనుకున్నారు. ఆయన లోపలికి ప్రవేశించేటప్పటికే ఆ హాలు ఉద్యోగస్తులతో దాదాపు నిండిపోయింది.

ప్రారంభంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కవితల పఠనం, గేయాల గానంతో ఉద్యోగస్తులు అలరించారు. కొద్ది సేపటికి అసలు సభ ప్రారంభం అయింది. పర్యావరణ కథల, కవితల రచనలో ప్రముఖుడైన ఒక రచయితను, అటవీశాఖ కార్యదర్శిని వేదిక మీదకు ఆహ్వానించారు. వారితో పాటు, 'డైమండ్ స్వీట్స్' అధినేత అంటూ ఒక వ్యక్తిని ఆహ్వానించారు. సన్నగా, పొడవుగా, పల్చని గెడ్డంతో, లాల్చీ, పై జమా వేసుకుని, భుజానికి సంచి తగిలించుకున్న ఒక 25-30 సంవత్సరాల మధ్య వయసు ఉండే యువకుడు వేదిక మీదకు వచ్చాడు. కరతాళ ధ్వనుల మధ్య అతని పేరు సరిగా వినబడలేదు రాఘవరావు గారికి.

సభ ప్రారంభం అయ్యాక – ప్రభుత్వ కార్యదర్శి పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకొంటోంది అనే అంశంపై ఒక అరగంట అనర్గళంగా ఉపన్యసించాడు. ఆ పథకాలు గ్రామాలలో ఏమాత్రం అమలులో ఉన్నాయో వాస్తవంగా తెలిసిన రాఘవరావుగారు పేలవంగా ఒక నవ్వు నవ్వారు. అయితే, పట్టణ వాసులైన ఆ ఉద్యోగులు తమ అధికారిని చప్పట్లతో సన్మానించారు. ఆ తరువాత పర్యావరణ రచయిత – తన కథలను, కవితలను ఉట్టంకిస్తూ, మధ్య మధ్యలో – పర్యావరణం కోసం ఇంతటి కృషి చేస్తున్న తనంతటి వాడికి పద్మశ్రీ, ఇత్యాది అవార్డులు రాకపోవడం దేశం చేసుకున్న దౌర్భాగ్యం అంటూ తన ఆక్రోశాన్ని వెళ్ళగక్కుతూ, సుదీర్ఘ ప్రసంగం చేసాడు. అతని ప్రసంగం ముగిసిన వెంటనే, అందుకోసమే ఎదురు చూస్తున్నారా

అన్నట్లు ప్రేక్షకులు మరింత గట్టిగా చప్పట్లు కొట్టారు. తరవాత, ఆ యువకుని వంతు వచ్చింది. పేరు విజయ కుమార్ అట – రాఘవరావు గారికి ఆశ్చర్యం కలిగింది, పర్యావరణానికి, ఈ స్వీట్ స్టాల్ నడిపే యువకుడికి సంబంధం ఏమిటి? బహుశ – కార్యక్రమం నిర్వహణకు ధన సహాయం చేసుంటాడు – పర్యావరణం గురించి ఇతను చెప్పేదేముంటుంది, ఇక వెళ్దామా అని లేచిన వారే, మళ్ళా బయటకు వెళ్లినా చేసే పని కూడా ఏమీ లేదు కదా- బస్ ఎప్పుడో రాత్రికి అనుకుంటూ కూర్చున్నారు.

"సభా సరస్వతికి నమస్కారం! అంటూ సంస్కారవంతమైన గొంతు సభను పలకరించేటప్పటికి అక్కడ నిశ్శబ్దం ఆవహించింది. "నేను చెప్పబోయే అంశం లోకి వెళ్లబోయే ముందు, మిమ్మల్ని ఒక్క ప్రశ్న వేయదలచుకున్నాను...మీలో 'మాత' అంటే గౌరవం లేనివారు ఎవరైనా ఉన్నారా?" ఎవరినుంచి సమాధానం లేదు.... ప్రేక్షకుల ముఖాలలో సందిగ్ధత గమనించి, తన ప్రశ్న సరిగా వినబడలేదేమో నని, మరలా "తల్లి" అంటే గౌరవం లేనివారు ఉన్నారా?" అంటూ ప్రశ్నించాడు. ఈసారి ఒక్కసారిగా – ప్రేక్షకులందరి నుంచి "నో" , అంటూ సమాధానం వచ్చింది. "తల్లి అంటే అందరికీ గౌరవమే" అంటూ కొంతమంది అందరి తరఫున మరింత గట్టిగా చెప్పారు.

"సంతోషం..అయితే, మనకు జన్మనిచ్చిన మాత కాకుండా – మరో ముగ్గురు మాతలు ఉన్నారని మీకు తెలుసా? అంటూనే, "వారు – భూమాత, గోమాత, గంగామాత" అన్నాడు. అంతకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు చేసినవారి కన్నా, నెమ్మదిగానే ఉన్నా, స్థిరంగా ఉన్న అతని స్వరం అందరినీ ఆకట్టుకొంది. అతను తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, "....అయితే, మన మాతకు ఇచ్చే గౌరవం, మనం ఈ ముగ్గురు మాతలకు ఇవ్వటం లేదు... అందుకే నేడు మనం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలన్నీ..." అంటూ, మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని ఎలా ధ్వంసం చేస్తున్నది, అవసరానికి మించి జలవనరులని, ఇతర వనరులని ఎలా వాడుకుంటున్నదీ, తన మూర్ఖత్వంతో ఎలా కలుషితం చేస్తున్నదీ ......వివరిస్తూ......సోదాహరణంగా అతను చేస్తున్న ఉపన్యాసం అక్కడ ఉన్నవారందరినీ ఆలోచింపజేసింది.... ముఖ్యంగా, చెక్ డాం లు, ఇంకుడు గుంతల నిర్మాణం మూలంగా కరువు ప్రాంతాలలో కూడా నీటి నిలువ ఎలా చేసుకోవచ్చో చెప్పి, అన్న హజారే కృషి తో 'రాలెగావ్ సిద్ధి' గ్రామం ఎలా నీటి కరువు నుండి బయటపడిందో వివరించాడు.

ఆ యువకుడి ప్రసంగం వింటున్న రాఘవరావుగారికి తన నేటి ప్రయాణం ఏమాత్రం వృధా కాలేదని అనిపించింది. అంతేకాదు, తన సమస్యకు పరిష్కారం లభించే అవకాశం కూడా ఉందన్న ఆనందం కలిగింది. ఆ తరువాత, భారతీయ దేశీయ గోసంతతి మూలాన ఒనగూరే ప్రయోజనాలను అతడు వివరిస్తూ, ప్రకృతి వ్యవసాయం గురించి చెపుతోంటే, అందరూ ఆశ్చర్యచకితులై వింటున్నారు.

అద్భుతమైన తన ప్రసంగం ముగిస్తూ, ఆ యువకుడు తన భుజానికి వేలాడుతున్న సంచిని అందరికీ చూపించాడు. "ఇది జనపనారతో చేసిన ప్రకృతి హితమైన చేతి సంచి...మనం ప్రతి చిన్న అవసరానికి ప్లాస్టిక్ బ్యాగులు వాడడం కాకుండా, ఇలా చేతి సంచి వాడడం అలవాటు చేసుకొంటే, మనమందరం పర్యావరణానికి హితం చేసినవాళ్ళమవుతాం....అందుకే, మా సంస్థ తరుపున అందరికీ ఉచితంగా చేతి సంచులను ఇస్తున్నాము.....దయ చేసి వీటిని ఇంట్లో మూలన పాడేయకుండా నిత్యం వినియోగించండి..."

అంటూ తన ప్రసంగం ముగించాడు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ఆ హాలు మార్మోగిపోయింది.

వందన సమర్పణతో సభ ముగిసినట్లు ప్రకటించగానే, ప్రభుత్వ కార్యదర్శి, రచయిత తమ దారిన తాము వెళ్లిపోయారు. అయితే ఆ యువకుని చుట్టూ ఉద్యోగస్తులు గుమిగూడారు- అతని ప్రసంగాన్ని వేనోళ్ళ పొగుడుతూ, అతని ఫోన్ నంబర్, ఇతర వివరాలు నోట్ చేసుకొంటున్నారు. జనం తగ్గాక, తను కూడా ఆ యువకుని దగ్గరకు వెళ్లి అభినందిద్దామని అనుకొంటూ, కొంచెం వెనగ్గానే నుంచున్న రాఘవరావు గారిపై ఆ యువకుడి దృష్టి పడింది. తన ఎదురుగా ఉన్న వారిని దాదాపు తోసుకొంటూ, అతడు వచ్చి రాఘవరావు గారి పాదాలకు నమస్కారం చేసాడు.

ఈ హటాత్పరిణామానికి చేష్టలుడిగి చూస్తున్న ఆయనతో- “మాష్టారూ గుర్తొచ్చానా? నేను – విజయ్ ని. వెంకటాపురం కరణం గారి మేనల్లుడిని. హైస్కూల్ లో మీ విద్యార్థిని. మీ అమ్మాయి దీప్తి క్లాస్ మేటుని……” అని గుర్తు చేసే ప్రయత్నం చేస్తున్నాడు. అతడు చెప్పిన విషయాల మూలంగా విజయ్ ని పోల్చుకున్న రాఘవరావు గారికి ఆశ్చర్యం, ఆనందం కలగలిసి, కొంతసేపటి వరకు నోట మాట రాలేదు. కాసేపటికి “చాలా ఆనందంగా ఉంది విజయ్, అనుకోకుండా చాలా ఏళ్ల తరువాత నిన్ను ఇక్కడ ఇలా కలుసుకోవడం – సరే కాని, నువ్వు మా ఊర్లో హైస్కూలు చదువు అయిపోయాక మరలా కలిసింది లేదు, ఇంజనీరింగ్, తరువాత ఎంబీయే చేసావు అని విన్నాను. ఇదేంటి మరి? స్వీట్ స్టాల్, పర్యావరణం, ఇంకుడుగుంతలు…” అంటూ రాఘవరావు గారు కురిపిస్తున్న ప్రశ్నలకు చిరునవ్వే సమాధానంగా ఇచ్చిన విజయ్ కుమార్, “మాష్టారూ, ముందు మా షాపుకి వెళ్లి, సావకాశంగా మాట్లాడుకుందాం …” అన్నాడు. ఆ హడావుడి నుండి మొత్తానికి ఇద్దరు బయటపడి, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఇందిరా పార్కు పక్కనే ఉన్న ‘డైమండ్ స్వీట్ స్టాల్’ చేరుకున్నారు.

“రండి మాష్టారూ, మీ రాకతో నా షాపు ధన్యమైంది ……” అంటూ విజయ్ సాదరంగా ఆహ్వానిస్తుంటే, ఆ స్వీట్ స్టాల్ లోకి అడుగుపెట్టిన రాఘవరావు గారికి, ఆ షాపు వాతావరణం చాలా ఆశ్చర్యంగా అనిపించింది. కష్టమర్లతో కిటకిటలాడుతున్న ఆ షాపు రూపురేఖలు పూర్తి పల్లె వాతావరణంలో ఉన్నాయి. పేడతో అలికిన గోడలు, దానిపై సున్నంతో తెల్లని ముగ్గులు, గోమాతల చిత్రాలు, అన్నీ ఆశ్చర్యంగా గమనించారు. మిలమిలా మెరిసిపోతున్న ఒక పెద్ద రాగి బిందె లోంచి మంచి నీళ్ళు రాగి గ్లాసుతో ఇచ్చాడు – విజయ్ కుమార్.

కుర్చీలో సావకాశంగా ఆసీనులయ్యాక, తన మనసులో మెదులుతున్న సందేహాలన్నిటికీ సమాధానమా అన్నట్లు – “మాష్టారూ, నేను ఈ రోజు ఇలా ఉండడానికి కారణం మీరే…..” అంటూ మొదలు పెట్టాడు విజయ్. “నేనా?” అంటూ ఆశ్చర్యపోతున్న రాఘవరావుగారితో, “అవును మాష్టారూ, మీరు మాకు హైస్కూలు లో చెప్పిన లెక్కలు, సైన్సు నాకు చక్కటి విద్యార్హతలు అందజేస్తే, నిత్యం పర్యావరణం పట్ల మనం చూపవలసిన బాధ్యత గురించి, సమాజానికి ఆదర్శంగా ఉండేటట్లు ప్రతి ఒక్కరు ఎదగడం గురించి మీరు చెప్పిన విషయాలు – నేను – ఇలా స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకొనేటట్లు చేసాయి. అంతేకాదు, అన్నా హజారే, పాలేకర్, వంటి వారి ప్రభావంతో పర్యావరణ పరిరక్షణకు జీవితం అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను.

అందుకే, రసాయనాలు లేని, పూర్తిగా పర్యావరణ హితమైన ఆహార ధాన్యాలు, పదార్థాలతోటే మిఠాయిలు తయారు చేసే ఈ దుకాణాన్ని ప్రారంభించాను.

స్వీట్లకు అవసరమైన పాలు, నెయ్యి, పెరుగు కోసం – దేశవాళీ ఆవులు పెంచడం మొదలుపెట్టాను. క్రమంగా గో సంబందిత ఉత్పత్తులపై పరిశోధన చేసి, ఉత్పత్తులను తయారు చేసి, అమ్ముతున్నాను- చూడండి…", అంటూ గోమయంతో చేసిన అగరువత్తులు, షాంపు, సబ్బులు, సున్నిపిండి, తదితర ఉత్పత్తులు చూపించాడు. "నా వ్యాపారం లోని లాభాలలో అధికశాతం – ఉచితంగా వివిధ ప్రాంతాలలో ఇంకుడు గుంతల నిర్మాణానికి, వినాయక చవితి మండపాలలో మట్టి గణపతుల తయారీకి, చేతి సంచుల తయారీకి వినియోగిస్తున్నాను" అన్నాడు.

ఆ మాటలు వింటున్న రాఘవరావు గారికి కళ్ళవెంబడి ఆనంద భాష్పాలు జలజలా రాలాయి. తన దగ్గర చదువుకున్న అనేకమంది విద్యార్థులు అత్యున్నత స్థానాలలోనూ, విదేశీ ఉద్యోగాలలోనూ స్థిరపడ్డారు, ఆ విషయాన్ని ఆయన ఎంతో గర్వంగా చెప్పుకుంటారు కూడా. అయితే, వారందరి కంటే ఉన్నతంగా నేడు విజయ్ ఆయన కళ్ళకు కనిపించాడు. గత 5,6 సంవత్సరాలుగా తాను చేసిన కార్యక్రమాలు, ఇంకుడుగుంతల నిర్మాణానికి సంబంధించిన పటాలు, సూచనలు విజయ్ చూపిస్తుంటే, రాఘవరావు గారు కన్నార్పకుండా చూస్తూ, శ్రద్ధగా వింటున్నారు. ఒక గోడపై "తవ్వండోయ్ ప్రతి ఇంటా- ఒక ఇంకుడు గుంత; ఇవ్వండోయ్ భూమికి బహుమతి ఎంతో కొంత" అంటూ రాసిన నినాదం ఆయనను కట్టిపడేసింది.

వెదకబోయిన తీగ కాళ్ళకు తగిలిన చందాన, తమ ఊరి సమస్యకు పరిష్కారం కళ్ళెదురుగా కనిపిస్తోంది రాఘవరావు గారికి. తన స్టాల్ లో ఉన్న వెరైటీ స్వీట్లను పరిచయం చేసి, రాఘవరావు గారి చేత కొసరి, కొసరి తినిపించిన తరువాత, "మాష్టారూ, ఈ స్వీట్స్ మీరు ఇంటికి పట్టుకెళ్ళి, అమ్మగారికి ఇవ్వండి. నా తరుపున బహుమతిగా.." అంటూ ఒక పెద్ద అట్టపెట్టె నిండా స్వీట్స్ సద్దుతున్న విజయ్ మాటలకు అడ్డు తగులుతూ, "ఈ చిన్న చిన్న బహుమతులతో నాకు పని లేదోయ్, ఇంతకన్నా పెద్ద బహుమతి నీ నుండి కోరుతున్నాను, కాదనకూడదు మరి.." అన్నారు రాఘవరావు గారు. "మాష్టారూ, ఏమి కావాలో చెప్పండి, నా దగ్గర మొహమాటం వద్దు" అన్నాడు విజయ్. విజయ్ ఇచ్చిన నమ్మకంతో, రాఘవరావు గారు తమ ఊరి పరిస్థితి, తాగు నీటికి కూడా ఇబ్బంది ఎదురవుతున్న పరిస్థితి వివరంగా చెప్పి- "వీటికి నువ్వే పరిష్కారం చూపగలవు అనిపిస్తోంది విజయ్" అన్నారు.

"అవును మాష్టారూ, మావయ్య కూడా నాకు ఒకటి రెండు సార్లు దీని గురించి చూచాయగా చెప్పారు. అయితే, మీరు చెప్పేంత వరకు సమస్య ఇంత తీవ్రంగా ఉందని అనుకోలేదు. పట్టణాలలోనే మేము ప్రతి అపార్టుమెంట్ కాంపౌండ్ లో ఇంకుడుగుంతలు ఉండేటట్లు చూడడం ద్వారా భూగర్భజలాల మట్టం పెరిగేట్లు చేయగలిగాం....మీ ఊరిలాంటి చోట కొద్దిగా శ్రద్ధ పెడితే, ప్రజలంతా కలిసి వస్తే, అది పెద్ద సమస్య కాదు, తప్పనిసరిగా మరల వచ్చే వేసవికి నీటి ఎద్దడి లేకుండా ఇప్పటినుండే జాగ్రత్తలు తీసుకోవచ్చు" అన్నాడు.

“హమ్మయ్య…నీ భరోసాతో నా నెత్తిన పాలు పోసావు విజయ్, నీ గురువుగా ఆదేశించటం లేదు, మా ఊరి సర్పంచిగా అభ్యర్థిస్తున్నాను - నువ్వు మా ఊరికి వచ్చి, ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణానికి విలువైన సూచనలు, ప్రణాళికలు రూపొందించడమే కాక, దగ్గరుండి వాటన్నింటి నిర్మాణాలను పూర్తి చేయించగలవా?” అన్నారు.

“ఎంత మాట మాష్టారూ? మేము ఇంతటి వారం అవ్వటానికి కారకులు మీరు, పైగా పది మందికి పనికొచ్చే పనికోసం, మీరు మమ్మల్ని అభ్యర్థించడం కాదు, ఆదేశించాలి…నేను తప్పనిసరిగా మీ వెంట ఉండి, ఆ పని పూర్తి చేస్తాను, అయినా, నేను నిత్యం చేస్తున్న పనే అది – నేను చిన్నప్పుడు చదువుకున్న ఊరికోసం ఆమాత్రం చేయలేనా?” అన్నాడు.

“ఈ రోజు రాత్రికి నా ఇంట్లో ఉండండి, రేపు సాయంత్రం ఇద్దరం కలిసి ఊరికి బయలు దేరి, పని ప్రారంభిద్దాం” అంటూ, “అన్నట్లు, మీరు నా బహుమతి తీసుకోనేలేదు…” అంటూ స్వీటు ప్యాకెట్టు మాష్టారి చేతిలో పెట్టాడు. “ఎందుకు తీసుకోలేదు? నా ఒక్కడికే కాకుండా, ఊరందరికీ నీ నుంచి బహుమతులు పట్టుకెళ్తున్నానుగా…నువ్వు అందించబోయే ఇంకుడుగుంతలే మాకు, మా ఊరికి “తీయని బహుమతి” అంటూ విజయ్ ని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు రాఘవరావు గారు.




హైకోర్టు హాలు..

కిక్కిరిసిన హాలు ఆత్రుతగా ఎదురి చూస్తోంది.. చూడదు మరి..!

కింది కోర్టు తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకున్న ప్రముఖ సినీ నిర్మాత ‘ఆల్ ఇన్ వన్’ బొందలోని శవం అంటే మాటలా..? మజాకా..?. శవం పూర్తి పేరు బొండలోరి శైశవం. కాని అతగాడు తీసిన సినిమాల ప్రాచుర్యం వాళ్ళ పేరు కాస్తా బొందలోని శవమని స్థిరపడింది. సింపుల్ గా జనం అతన్ని శవం అని పిలవడం కద్దు.

అన్నట్టు ఆల్ ఇన్ వన్ అంటే అర్థమయ్యిందనుకుంటాను.. కథ నుండి మొదలుబెడితే. సినిమాను సింగారించే సరంజామా.. అంతా మన శవంగారి చేతి చలువే.. స్క్రిప్ట్ రైటర్ ఇంకా డైరక్టర్ కూడానూ..

అయితే ఈ మధ్య తన స్వంత కథలతో వ్యథలు మొదలయ్యాయని ఏంమ్మాయ చేసాడో.. ఏమో..! గాని ‘మంచం కింద కాళ్ళు’ అనే సినిమా వివాదంలో చిక్కుకుంది.

‘మంచం మీద కోళ్ళు’ అనే నా నవలను కాపీ చేసి ‘మంచం కింద కాళ్ళు’ అనే సినిమా అనుమతి లేకుండా తీసారని సదరు రచయిత హరిశ్చంద్ర జిల్లా కోర్టుకెక్కాడు. విజయం సాధించాడు. అయితే అది జీర్ణించుకోలేని శవం.. తీర్పు తన వశం కావాలని హైకోర్టులో సవాలు చేసాడు.

జడ్జి గారి ప్రవేశంతో హాలు సద్దుమణిగింది.

అలవాటు ప్రకారం జడ్జి గారు “ఆర్డర్.. ఆర్డర్..” అంటూ చెక్క సుత్తితో బల్లపై రెండుమార్లు మోదాడు.. కేసు విచారణకు అనుమతించాడు. కేసు వాదోపవాదాలు జడ్జిగారి సుత్తిని నిలవరించలేక పోతున్నాయి. డిఫెన్స్ లాయర్ తన అపూర్వమైన అనుభవానికి అమోఘమైన వాక్ చాతుర్యం తోడై కోర్టును దడ, దడ లాడిస్తున్నాడు.

“మై లార్డ్.. హరిశ్చంద్రగారి అభియోగం హాస్యాస్పదం.. అసలు పేరులోనే గొప్ప వ్యత్యాసముంది. నవల పేరు మంచం మీద కోళ్ళు.. బొండలోరి శైశవంగారు తీసిన సినిమా పేరు మంచం కింద కాళ్ళు.. కథంతా ఆ కాళ్ళతోనే నడుస్తుంది.”

అంతలోనే అఫెన్స్ లాయరు అడ్డుకున్నాడు.

"మై లార్డ్.. నవలలో కూడా నడిచే కథ సొంతం కాళ్ళ మీద కోళ్ళ మీదే..

కథానాయకుడు, నాయకురాలు మంచం మీద అయితే దొరికి పోతామని మంచం కింద దూరుతారు. అప్పటికే మంచం కిందున్న ఒక కోడి పెట్టపై పారుదామని లైనేసే కోడి పుంజు భయపడిపోతుంది. రెండూ కలిసి జంపై మంచమెక్కుతాయి.

మంచం మీద వాటి పని కాగానే మంచం కింద కదిలే కాళ్ళను కోళ్ళు పసిగడ్తాయి. తమకు ఆటంకం కలిగించిన వాళ్ళను వదులొద్దని పగబడ్తాయి. వాళ్ళ పనికీ ఆటంకం కలిగించాలని ఆ జత కాళ్ళను మాటి మాటికి కెలుకుతూ వుంటాయి కోళ్ళు. దాంతో కోళ్ళకు ప్రాముఖ్యతనిచ్చి నవల పేరు మంచం మీద కోళ్ళు అని నా క్లయింట్ హరిశ్చంద్రగారు ఆ పేరు పెట్టారు.

నవలలోని ప్రతీ అంశం మక్కీకి మక్కీ కాపీ గొట్టి తీసిన సినిమా ఇది. ప్రేక్షకుల కోసం శవంగారొక పజిల్ పెట్టారు. 'హీరో.. హీరోయిన్ తృప్తి చెందారా..! లేదా..! కోళ్ళ పగ తీరిందా..? ' అనేవి పజిల్ లోని ప్రశ్నలు.. దాంతో డబ్బులు దండిగా దండుకున్నాడు" అని ధీటుగా జవాబిచ్చాడు.

"ఆబ్జెక్షన్ మై లార్డ్.. పజిల్ అనేది ఈ కేసుతో సంబంధం లేనిది" అంటూ జడ్జిగారు మూర్ఛ పోయేంతగా గట్టి కేక వేసాడు డిఫెన్స్ లాయరు.

"ఆబ్జెక్షణ సస్టైండ్" అన్నాడు జడ్జి. డిఫెన్స్ లాయర్ ముఖం బండి గీరంతగా మారింది. పెదవులపై మొలచిన నవ్వుతో కళ్ళు ఎగరేసాడు.

"అయినా రచయిత హరిశ్చంద్రగారు డబ్బుకాశపడి ఈ కేసు వేయలేదు.. సినిమాలో తన పేరు కథా రచయితగా వేయలేదన్న మానసిక క్షోభ అతన్ని కోర్టుకు దారి చూపింది" అని అఫెన్స్ లాయరందుకున్నాడు. ప్రేక్షకుల హర్షధ్వనుల మధ్య చప్పట్లు మోగసాగాయి.

"ఆర్డర్.. ఆర్డర్.." అంటూ జడ్జిగారి సుత్తి దెబ్బలు మామూలే..

"కథ కాళ్ళ మీద కోళ్ళ మీద అయితేనేం..!

నవలలో హీరో కాళ్ళు హీరోయిన్ కాళ్ళపై వుంటాయి. సినిమాలో హీరో కాళ్ళు హీరోయిన్ కాళ్ళ కింద వుంటాయి. నవలలోని కోళ్ళు నల్లవి.. సినిమాలోని కోళ్ళు తెల్లవి. ఆమాత్రం తేడా మన అఫెన్స్ లాయరుగారు గుర్తించక పోవడం శోచనీయం" అంటూ ముఖం గక్కే చెమటలను తుడుచ్చుకోసాగాడు డిఫెన్స్ లాయర్.

హాల్లో నవ్వుల వర్షం కురిసింది. జడ్జిగారు సైతం తన నగుమోమును దాచ ప్రయత్నం చేసేడు. తీర్పు మరో వారానికి వాయిదా పడింది.

***

"ఇదే మంచి తరుణం.. మించినా దొరకదు. జడ్జిగారు కావాలనే తీర్పును వారం రోజుల పాటు వాయిదా వేసాడు. మీ కేసుకు రెండు సూటుకేసుల డబ్బు చాలు. ఇప్పటికే నేను నాశాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. మీ కేసు నాకనుకూలమైన బెంచికి అలాట్ చేయించుకోవడం.. నేననుకున్న జడ్జిని నియమించుకోవడం తడిసి మోపడయ్యింది.

మన జడ్జి గారి సంగతి నీకు ఇంకా పూర్తిగా తెలియదు. ఆరు మర్డర్లు చేసి ఆరు లక్షలిస్తే సాక్ష్యాలను తలకిందులు అవలీలగా కేసు నుండి గట్టెక్కిస్తాడు.

అదంతా నీకు వివరించాలంటే సాప చిరిగి చాటంతైతదిగాని.. నీ కెందుకు చెప్పు. డబ్బిస్తే చాలు జడ్జి గారినే కాదు.. వాడి జేజెమ్మను కూడా మేనేజ్ చేయగల సత్తా వుంది నాకు.." అంటూ డైరక్టర్ శవం మెదడు వేపి తినసాగాడు డిఫెన్స్ లాయరు.

శవం చేసేదేమీ లేక తన వద్ద ఉన్నది ఊడ్చి చేతిలో పెట్టాడు.

'దీని కంటే ఆ రచయితకు డబ్బిచ్చినా పుణ్యమైనా దక్కేది. లేదా 'కథ – రత్నం' అని సినిమాలో పెరేసినా నాకీ నక్షత్రకుని బాధ తప్పేది అని మనసులో కుమిలిపోసాగాడు శవం. తలపై తెల్ల గుడ్డ తప్పదేమో.. అని అనుమానం లేకపోలేదు. కాని కేసు ఇంత దూరం వచ్చాక తప్పతుందా..? 'నిండా మునిగిన వానికి చలి పెట్టదన్నట్లు'.

***

సిగ్నల్ సెక్షన్ వద్ద "బాబూ.. ధర్మం చెయ్యండి.." అంటూ అడుక్కునే గొంతు ఎక్కడో విన్నట్లు అనిపించి కారు సైడు మిర్రర్ లో నుండి చూసాడు డిఫెన్స్ లాయర్. ఒంట్లో వణుకు పుట్టింది. గ్రీన్ లైట్ పడగానే కారు స్టార్టు చేసాడు.. శవంగారి శాపనార్థాలు వినరానంత వేగంగా కదిలి పోయాడు.

***




"బాస్! మాలతీ చంద్ర ..ఈ మధ్య మర్డర్ అయిన చంద్రవర్ధన్..గారి భార్య మీ అప్పాయింట్ మెంట్ కోసం వెయిట్ చేస్తున్నారు..మీరు టైం ..చెపితే?"

తన సెక్రటరీ స్టెల్లా ఫోన్ కట్ చేస్తూ..

"అర్జెంటు అయితే యిప్పుడే పంపించు లేదంటే ..."

“బాస్ ! ఆమె చాలా ఆందోళనగా వున్నారు..ఏడ్చేస్తున్నారు .”

“ముందు కన్ సోల్ చేయండి. ఆమె రిఫ్రెష్ అయ్యాక ..పంపించు .”

“నమస్తే డిటేక్టివ్ బాలిగారూ !”

పదేళ్ళ అమ్మాయితో వచ్చిన మాలతీచంద్ర ..మూర్తీభవించిన దైన్యానికి ప్రతి రూపంలా వుంది.ఆమె తో పాటు వచ్చిన స్టెల్లా నెమ్మదిగా యిద్దరినీ కూర్చోబెట్టింది.తను తన నోట్ పేడ్ తో ..మరో కుర్చీలో సెటిల్ అయిపోయింది .

పూర్తిగా నలభై కూడా దాటని వయసులో..అరవై దాటిన లేడీ లా వుంది .

“మాలతి గారూ ! మీ వారి మర్డర్ కేస్ దాదాపు ఫైనల్ స్టేజి కొచ్చిందని పేపర్ న్యూస్.”

“న్యూస్ కరక్టే బాలిగారు ..దానితో నాబ్రతుకే ఆఖరి దశలోకి వస్తుంది. మా లాయర్ ఇప్పటికే చేతులేత్తేసారు..

విధవగా మారిన నా బ్రతుకు అనాధగా దీని బ్రతుకు దినదిన గండంగా వుంది . పేరుకు మాత్రం ఓ పెద్ద బిల్డర్ భార్యనే..కానీ బ్రతుకు మాత్రం అనాధ బ్రతుకే .భవిష్యత్తు అంతా అంధకారమే.”

“మీ బాధ అర్థం చేసుకో గలను. ఇది కోర్ట్ కేసు.. యిందులో మేము ఏమి చేయ గలమో అర్ధంకావడము లేదు.”

“మా లాయర్ గారు రాంప్రసాదు గారు ..ఆయన మీకు ఫ్రెండ్ అని చెప్పారు. నేను చేయ గలిగింది చేశాను. జూలి బ్లైండ్ కాదని నిరూపించ లేక పోయాను. ఒక బ్లైండ్ లేడీ తనకన్నా బలమైన వ్యక్తిని కత్తితో..సూటిగా గుండెల్లో పొడిచి యెలా హత్య చేయగలదు ?పోలీస్ ఇప్పటికే ఈ కేస్ ను ఆత్మహత్యగా నిర్ణయించి ఫైల్ మూసేసారు . ఈ ఒక్క పాయింట్ మీదే కోర్ట్ కూడా కేస్ కొట్టి వేసే

ఛాన్సు వుంది అంటున్నారు . నా పేరు చెప్పి తను ఏమైనా చేయ గలడేమో అడిగి చూడండి..నేనూ ఫోన్ చేసి కేస్ గురించి వివరిస్తాను.ఇక మీ అదృష్టం మీద ఆధారపడివుంది అన్నారు.. బాలి గారూ ! మీరే మాకు దిక్కు .ఆస్తి కన్నా నా భర్తను అమానుషంగా పొట్టను పెట్టుకున్న ఆ మాయలాడి కి శిక్ష పడాలి .”

ఆపుకోలేని దుఖంతో గట్టిగా ఏడ్చేసింది. తల్లిని పట్టుకుని ఆ పాప కూడా..ఏడుపు మొదలు పెట్టింది. స్టెల్లా లేచొచ్చి యిద్దరిని ఓదార్చింది.

“మాలతిగారూ..మీ బాధ నాకు అర్ధ మయ్యింది..నేను రాంప్రసాద్ తో మాట్లాడుతాను. కేస్ వివరాలు తెలుసుకుని నేను ఏమైనా చేయగలిగితే తప్పకుండా చేస్తాను.మీరు మీ ఫోన్ నెంబర్ అడ్రస్ మా శిరీషకు యిచ్చి వెళ్ళండి ..కేస్ ఫైనల్ హియరింగ్ నెక్స్ట్ వీక్ అన్నారు కదూ?”

“అవును బాలి గారూ..యివ్వాళ పది. .పదిహేడో తారీకున కేస్ ఆఖరి వాయిదా. మీరే మాకు దిక్కు..”

“అమ్మా ! నేను యేదైనా చేయగలిగితే తప్పకుండా చేస్తాను.మీరు బాధ పడకండి.”

“మీ నోటి మాటతో నాకు కొండంత ధైర్యం వచ్చింది. వస్తాను బాలి గారూ!”

“అవినాష్ !లాయర్ రాంప్రసాద్ తో మాట్లాడి కేస్ పూర్వాపరాలు తెలుసుకో. స్టెల్లాకు .. శిరీషకు ఈ కేస్ కుసంబంధించిన టీవీ క్లిప్పింగ్స్ వుంటే సార్ట్ చేసి పెన్ డ్రైవ్ లో లోడ్ చేయమని చెప్పు.”

బాలి తన అసిస్టెంట్ అవినాషు కు చెప్పాడు.

*****

“బాస్! లాయర్ గారితో మాట్లాడాను. కేస్ కు సంబంధించిన ఫైల్స్ మెయిల్ చేస్తానన్నారు.ఆయన బ్రీఫ్ చేసిన వివరాలు..

“చంద్రవర్ధన్ సిటీ లో పేరు మోసిన బిల్డర్.ఆయన మొదటి భార్య మాలతీ ..సంవత్సరం క్రితమే ఈ జూలి అనే యువతి ఆయన జీవితం లోకి వచ్చిందట . మొదట ఆఫీస్ లో పీయస్ గా చేరిందట.యెలా ట్రాప్ చేసిందో వన్ ఫైన్ మార్నింగ్ చంద్రవర్ధన్ ఇంట్లో కి ఎంటర్ అయిపోయిందట. బిల్డర్ కాక ముందు చంద్ర సామాన్య వ్యక్తి .. బిల్డర్ గా బాగా కలిసొచ్చాక ..తాగుడు ..పేకాట క్లబ్బులతో బాటు అమ్మాయిల వ్యసనం బాగా అధికమై పోయి భార్యా బిడ్డలకు దూరమై పోయి జూలి తోనే కాపరం పెట్టేశాడని..పుకారు.”

“ముందు చంద్ర వర్ధన్ హౌస్ ని కాన్సన్ట్రేట్ చెయ్ ..నువ్వో జాకినో ఎవరో ఒకరు ఆ ఇంట్లో చేరి పోవాలి. ప్రతి క్షణం జూలి ని గమనించాలి.ఎలాంటి అనుమాన మొచ్చినా రికార్డు చేయాలి.నో టైం ..మూవ్.. ఫాస్ట్.”

“ఓకే బాస్! నేను జాకీ ఆ పని మీదే వుంటాం .”

****

“మిస్టర్ బాలి! చంద్రవర్ధన్ కథ అనేకంటే జూలి సస్పెన్సు స్టోరీ అంటే బాగుంటుంది. ఎలా ట్రాప్ చేసిందో ..మాలతీ అవుట్.. తను ఇన్.. చంద్రవర్ధన్ అవుట్ ఫరెవర్. జూలి మాలతిని ఇంటి నుంచి పంపించేశాక తన ప్లాన్ అమలు చేసింది.ఆస్తి తన పేరున రాయాలని సతాయించడం మొదలు పెట్టింది. చంద్రవర్ధన్ కు జూలి స్వరూపం అర్ధమైనట్లుంది ..కొంత రియలైజేషన్ వచ్చినట్లుంది తన భార్యా బిడ్డలకు అన్యాయం చేయ కూడదని..ఆస్తి యిద్దరికీ రాయాలనే ఆలోచనని పసిగట్టిన జూలి వీలునామా రాయక ముందే చంద్రవర్ధన్ ను లేపేయాలనే ఐడియా ఫాం చేసుకుంది. అయితే ఓ రోజు ఫ్రెండ్స్ తో బాగా డ్రింక్ చేసి ఇంటికొచ్చిన భర్తతో గొడవ పడింది. ఆ నిషాలో చంద్రవర్ధన్ నెట్టేయడంతో ..టేబుల్ కార్నర్ మీద పడిపోయి కనుచూపు కోల్పోయిందనేది.. డాక్టర్స్ ప్లస్ బ్లైండ్ స్కూల్ నిపుణులు నిర్ధారించారు.”

“ఓకే ! చంద్ర మర్డర్ యెలా జరిగింది? యెవరు చేసుంటారు?”

“లోకం కోడై కూస్తోంది జూలి నే హంతకురాలని. కాని కోర్ట్ మాత్రం నమ్మడం లేదు.”

“కోర్ట్ నమ్మకపోవడానికి రీజన్స్?

" బ్లైండ్ లేడీ తనకంటే బలవంతుడైన మగవాడిని తిన్నగా గుండెల్లో పొడిచి యెలా హత్య చేయగలదని .." దానికి మీ అర్గ్యుమెంట్స్ యేమిటి?"

"నెంబర్ వన్ ..తాగిన మైకంలో స్పృహ తప్పిన భర్తను చూపులేకపోయినా చంపడం అసాధ్యం కాదని . నెంబర్ టు..ఆమెకు చూపు పూర్తిగా పోలేదని ..ఆమె బ్లైండ్డ్ లేడీ కాదని ."

"కానీ మీరు ఆమె బ్లైండ్ కాదని నిరూపించ లేక పోయారు .అంతేనా?"

"ఎగ్జాట్లీ అంతే . మేము చేయని ప్రయత్నాలు లేవు . ఆ ఇంట్లో సిసి కెమారా కూడా ప్లాంట్ చేయించాను. ఈ మహా నటి యాక్షన్ ముందు ఒరిజినల్ బ్లైండ్ వాళ్ళు కూడా బలాదూరే.కోర్ట్ సిసి కెమారా రికార్డింగ్ ..కొట్టేసింది ..ఆ రికార్డింగ్ ఆమె కే ఫేవర్ గా మారిపోయింది."

"మీ కోర్ట్ లకు సాక్ష్యాలే తప్ప నిజాలు అక్కరలేదు . అది సరే ముందు జరిగింది చెప్పు . మర్డర్ కు లీడ్ చేసిన సంఘటలు కావాలి."

"ఓకే మిస్టర్ బాలి !

మాలతి స్టేట్మెంట్ ప్రకారం ..ఆ రోజు అంటే మర్డర్ జరిగిన రోజు సాయంత్రం మిస్టర్ చంద్ర ఫోన్ చేసారట. ఆస్తి పంపకాలు చేస్తున్నాని అమ్మాయిని తీసుకొని రాత్రికి బయలు దేరి రమ్మని . మాలతి యర్లీ మార్నింగ్ వచ్చే టైం కు ముందే మర్డర్ జరిగి పోయిందట . పోలిస్ లెక్క ప్రకారం అర్ధ రాత్రి పన్నెండు గంటల టైం లో మర్డర్ జరిగింది. బ్లైండ్ లేడీ మర్డర్ చేయలేదు ..యిది ఖచ్చితంగా ఆత్మ హత్యే నని కేస్ మూసేశారు.బాగా లంచాలు చేతులు మారాయని నా అనుమానం."

"ఓకే..ముందు చంద్రవర్ధన్ మృత దేహాన్ని చూసిందిఎవరు.?"

"పనమ్మాయి పేరు రంజిత .ఇంటికి వెళ్ళేటప్పుడు బయట లాక్ చేసుకొని వెళ్ళిపోయి మార్నింగ్ వచ్చి తనే తలుపులు తెరుస్తుందట .ఆ తర్వాతే మిగతా వర్కర్స్ వస్తారు. ఆ రోజు రంజిత వచ్చే టైం కి మాలతి వచ్చిబయట వెయిట్ చేస్తోందట . ఇద్దరూ ఒక్కసారే లోపలికెళ్ళి డెడ్ బాడీ ని చూసారట."

"ఆ టైములో జూలి యెక్కడ వుందని చెప్పారు.?"

తనకి చూపు లేనందువలన రంజిత వచ్చేంత వరకూ తన బెడ్ రూం లోనే ఉంటుందట. అలాగే ఆ రోజు కూడా ఉన్నదన్నారు. రంజిత తో బాటు ఏడ్చు కుంటూ వెళ్ళి మాలతియే జూలి ని లేపి చెప్పిందట .

అంటే ఓ హంతకురాలికి మాలతి గారే ఎలిబి అన్నమాట .

ఒక విధంగా అంతే.అక్కడనుండి జూలి రంజిత సాయంతో వెళ్ళి చంద్ర శవం మీద పడి భయంకరంగా ఏడ్చేసి పోలీస్ వచ్చే టైం కు స్పృహ తప్పి పడిపోయిందట. పోలీసులే ఫస్ట్ ఎయిడ్ చేసి డాక్టర్ ని పిలిపించారట.

"నౌ ఫర్గెట్ ఎవ్విరీథింగ్. నౌ టెల్ మీ యువర్ ఫైనల్ ట్విస్ట్..ఐ మీన్ ఈ కేసులో మానుండి యెలాంటి హెల్ప్ కావాలనుకుంటున్నావు?"

"మాలతి పక్షాన న్యాయం వుందని నా అభిప్రాయం .కానీ తగిన సాక్ష్యాలు లేక ఏమి చేయలేక పోతున్నాను. ఇంకా ఆరు రోజుల టైమ్ మాత్రమే వుంది.జూలి మాములు స్త్రీ కాదని ..ప్లాన్ ప్రకారమే చంద్రను హత్య చేసి నాటకాలాడుతుందని నా అనుమానం."

"ఫైనల్ హియరింగ్ అంటున్నావు. యిప్పుడు సాక్ష్యాలు అంటే ?"

"నేను మేనేజ్ చేయగలను. డబ్బుకు లోకం దాసోహం..పైగా జడ్జి గారిది మా కులమే. కేకే వన్ అన్నమాట.ఫైనల్ హియరింగ్ కు ముందు ఓ అవకాశం కోరుతాను ..తీసుకుంటాను."

"మా జాకి అవినాష్ లు గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో రిజల్ట్ చెపుతాను . ఈ కేసు కు సంబంధించిన అవైలబుల్ మెటిరియల్ మా అవినాష్ కు ఇవ్వు. నేను కూడా ఆ బ్లైండ్ లేడీ నటన చూడాలనుకుంటున్నాను.

"థాంక్స్ మిస్టర్ బాలి ! "

****

“బాస్! యిది మన శిరీష గేదర్ చేసిన క్లిప్పింగ్స్ కు సంబంధించిన పెన్ డ్రైవ్..ఫైల్స్ అన్ని లాయరు గారు మెయిల్ చేశారు. మన జాకీ రంజిత ను ట్రాప్ చేసి తన బాయ్ ఫ్రెండ్ గా ఆ ఇంట్లోకి ఎంటర్ అయిపోయాడు. కానీ ఫలితం మాత్రం నిల్ . రంజిత యెలా మేనేజ్ చేసిందో తన బాయ్ ఫ్రెండ్ గా జూలి కీ పరిచయం చేసి తనకు హెల్పర్ గా తనతోనే ఉండేందుకు అనుమతి కూడా సంపాదించిందంట.రంజిత కూడా మామూలు అమ్మాయి కాదని జాకి అభిప్రాయము . రెండు రోజుల తర్వాత కూడా యెలాంటి క్లూ దొరకలేదట. జాకీ కూడా యింకా డైలమా లోనే వున్నాడు.జూలి బ్లైండ్ లేడీ యా కాదా ? తన అభిప్రాయాన్ని చెప్పలేక పోతున్నాడు.కానీ జూలి తో బాటు రంజిత లో కూడా ఏదో మిస్టరీ దాగి వుందని ..అదేమిటో అర్థం కావడం లేదు ..ప్రయత్నిస్తున్నాను అంటున్నాడు.”

“ఓకే నేను చెప్పిన ఆ విషయం.. వెరీ ఇంపార్టెంట్ ?

ఆల్ రెడీ.. రెడీ బాస్ !

*****

ఆ రోజు.. బ్లైండ్ లేడీ కేసులో తీర్పు ..చెప్పే రోజు . చానెళ్ళ బూస్ట్ అప్ మూలంగా రాష్ట్రంలోనిఅన్నిప్రాంతాలనుంచి.. పెద్ద యెత్తున వచ్చిన ప్రేక్షకుల తో కోర్ట్ గ్యాలరీ నిండిపోయింది .అన్ని చానెళ్ళ రిపోర్టర్స్ తో బాటు ప్రింట్ మీడియా జనాలతో క్రిక్కిరిసి పోయింది.

డిటెక్టివ్ బాలి సూచనలతో కోర్ట్ హాల్ సెట్టింగ్ లో మార్పులు చేశారు.బ్లైండ్ లేడీ సీట్ జడ్జి గారి డయాస్ కు యెదురుగా విట్ నెస్ స్టాండ్ బ్లైండ్ లేడీ సీట్ కు వెనుకగా జడ్జి గారి అనుమతితో అరేంజ్ చేయించ గలిగాడు లాయర్ రాంప్రసాద్. ఉదయం పదిన్నర గంటలయింది.

జడ్జి గారు చైర్ లో ఆసీనులయ్యారు .

బ్లైండ్ లేడీ ప్రక్క రంజిత జాకీలు నిలబడి వున్నారు .

జడ్జి గారి అనుమతి తో మాలతి లాయర్ రాంప్రసాద్ తన వాదనను ప్రారంభించాడు .

యువరానర్ ! కేస్ ఫైనల్ హియరింగ్ కు ముందు నా అభ్యర్ధనతో అతి ముఖ్యమైన సాక్షిని ప్రవేశ పెట్టేందుకు అనుమతిచ్చిన కోర్ట్ వారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియచేసుకుంటున్నాను . బ్లైండ్ లేడీ గా పిలవబడే ఈమె పేరు జూలీ . ప్రముఖ కంట్రాక్టర్ చంద్ర వర్ధన్ రెండవ భార్య. ఈమే హత్య చేసిందన్న నా క్లయింట్ మాలతి గారి అభి యోగాన్ని బలపరిచే తగిన సాక్ష్యాలు చూపించ లేక పోయాను .

బ్లైండ్ లేడీ ముఖంలో తొంగి చూసిన చిరునవ్వు జడ్జ్ గారి దృష్టిని తప్పించుకోలేక పోయింది . వెంటనే తన తప్పును గ్రహించినట్లు సర్దుకుంది జూలి. లాయర్ రాంప్రసాద్ తన వాదనను కొనసాగించాడు.

యువరానర్! యింతకాలం చంద్రవర్ధన్ చనిపోయాడనే వాదన తప్పు అని మనవి చేసుకుంటున్నాను ! చంద్రవర్ధన్ చనిపోలేదు.ఆయన సజీవంగానే వున్నారు.

కోర్ట్ హాలంతా..నిశ్శబ్దం తో గడ్డ కట్టుకు పోయింది .

డిఫెన్స్ లాయర్ నిలబడి అడ్డు పడబోతుంటే జడ్జి గారు చేతి సైగతో “నో “ అని వారించారు .

జూలి ముఖంలో రంగులు మారడం జడ్జి గారి ద్రుష్టి నుంచి గాని ప్రక్క చాంబర్లో ..సిసి టివి మానిటర్ ముందున్న బాలి బృందాన్ని గాని తప్పించుకోలేకపోయింది .

బాలి తన ప్రక్కనున్న ఫేస్ రీడింగ్ ఎక్ష్ పర్ట్ ను చిరునవ్వుతో చూసాడు .

దానికి సమాధానంగా ప్లీజ్ వెయిట్ అన్నట్లు చూసాడు ఎక్ష్ పర్ట్ మిస్టర్ గోయంకా .

యువర్ ఆనర్! మీరు అనుమతి యిస్తే చనిపోయాడని భావిస్తున్న మిస్టర్ చంద్ర వర్ధన్ను మా ఆఖరి సాక్షిగా ప్రవేశపెడతాను.

గడ్డ కట్టుకుపోయిన నిశ్శబ్దం కరిగి పోయినట్లు ఒక్కసారిగా కలకలంతో ..కల్లోల మై పోయింది కోర్ట్ హాల్.

జడ్జి గారి హెచ్చరికతో సద్దుమణిగింది.

బ్లైండ్ లేడీ బాడీ లేంగ్వేజ్ లోమార్పు వచ్చేసింది. బాలి ముఖం చిరునవ్వులో వెలిగిపోతుంటే ..మిస్టర్ గోయంకా అర్ధమైనట్లు తల వూపాడు .

డిఫెన్స్ లాయర్ ..దిక్కులు చూస్తుంటే..రాంప్రసాద్ చిన్నగా నవ్వుకున్నాడు.

మిస్టర్ రాంప్రసాద్! యువర్ రిక్వెస్ట్ గ్రాంటెడ్..ప్రొసీడ్.

చంద్రవర్ధన్..చంద్రవర్ధన్..చంద్రవర్ధన్..

కోర్ట్ బంట్రోతు మూడుసార్లు పిలిచాడు .

"కమింగ్ సర్! "

మాట్లాడుతూ ..మాలతీ దేవి ..పదేళ్ళ కుమార్తె శాలినితో నడిచి వస్తున్న వ్యక్తిని చూస్తూనే..హాలంతా కరతాళ ధ్వనులతో మారు మ్రోగి పోయింది.

ప్రమాదాన్ని పసికట్టిన రంజిత జూలీ ని టచ్ చేసి హెచ్చరించాలనే ప్రయత్నాన్ని గమనించిన జాకీ ..రంజిత చేతిని కదలకుండా గట్టిగా పట్టేసాడు.

"కమింగ్ సర్ "అన్న చంద్రవర్ధన్ వాయిస్ వింటూనే బ్లైండ్ లేడీ బాడీ లో మారుతున్న వైబ్రేషన్స్ స్పష్టంగా సిసి మానిటర్

లోకనిపిస్తుంటే గోయంకా బాలికి పాయింట్ చేసి చూపిస్తూ ఏదో వివరిస్తుంటే ..అప్పటికే దాదాపు కన్ఫం చేసుకున్న బాలి ..

“యూఆర్..రైట్ మిస్టర్ గోయంకా. ప్లీజ్ వెయిట్ అండ్ సీ ద డ్రామా.”

అప్పటికే బ్లైండ్ లేడీ వెనుకున్న విట్నెస్ స్టాండ్ లో నిలబడిన చంద్రవర్ధన్ జడ్జ్ గారిని విష్ చేసి తన గొంతు విప్పాడు
“యువరానర్! నా పేరు చంద్రవర్ధన్.ఆ రోజు రాత్రి నా రెండో భార్య మీ ముందున్న జూలియే..నా మీద హత్యా ప్రయత్నం చేసింది. “

ఆ మాటలు వింటునే..ఒక్కసారిగా వెనక్కి తలతిప్పి విట్నెస్ స్టాండ్ వంక చూసి ..అందులోని వ్యక్తిని చూస్తూనే..హిస్టారిక్ గా

“ నో...హి ఈజ్ ఏ ఛీటర్..చంద్రా కాదు ..”

నోరుజారి హటాత్తుగా ఆగిపోయింది .

గోయంకా లేచొచ్చి బాలి ని కౌగలించేసుకున్నాడు .

*****

కోర్ట్ సెమినార్ హాల్.

చానళ్ళ కెమారాలు ...రిపోర్టర్ ల తో హాల్ క్రిక్కిరిసిపోయింది.

హైకోర్ట్ లాయర్ల తో బాటు జడ్జిలు కూడా హాజరయ్యారు.

అందరిలోనూ ..క్యూరియాసిటి. ఫైనల్ హియరింగ్ కొచ్చిన కేస్ హటాత్తుగా మారిపోవడం ..నిర్దోషి అనుకున్న జూలి ..దోషి గా మారడం ..బ్లైండ్ లేడీ గా అనుకున్న వ్యక్తి బ్లైండ్ కాదని తేలిపోవడం ..వూహలకందని ట్విస్ట్ లతో .. ఈ కేస్ అందరిలో తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగించింది .

అందరిని విష్ చేసి డిటెక్టివ్ బాలి తన పరిశోధన ను వివరించాడు .

"శ్రీమతి మాలతి గారు నా ఆఫీసులో తన గోడు చెప్పుకుంటూ..

"నాకు ఆస్తి కాదు ముఖ్యం ..నా భర్తను పొట్టను పెట్టుకున్న ఆ మాయలాడికి శిక్ష పడాలి అన్నారు.." ఆమె ఆవేదన నా గుండెల్ని తాకింది.నా స్నేహితుడు లాయర్ రాం ప్రసాద్ వ్యక్తపరిచిన అనుమానాల్లో నాకు రీజన్ కనిపించింది.అప్పుడే చెన్నైవిజిపిగోల్డెన్ బీచ్ లో శిలావిగ్రహంలా రెప్ప వేయని మనిషి ఫ్లాష్ అయ్యాడు.నా దోస్త్ రవికిరణ్ సైకియాట్రిస్ట్ ..తో మాట్లాడాను. "

"ఆ అమ్మాయి బాగా ట్రైనింగ్ ..తీసుకుంది.జరగబోయే విషయాలలో ఆమె చాలా షార్ప్ గా రియాక్ట్ అవుతోంది. తన అసిస్టెంట్ రంజిత సాయం తో డ్రామా నడుపుతోంది .కానీ యెంత ట్రైనింగ్ తీసుకున్నా షాక్ కొడితే చేతిని తీసుకోకుండా ఎవరూ ఉండలేరు.దానినే మనం అసంకల్పిత ప్రతీకార చర్య అంటాం . అటువంటి సంఘటన క్రియేట్ చేయ గలిగితే ..కేస్ సాల్వ్ అయ్యే ఛాన్స్ వుంది.అన్నాడు."

"దాని పర్యవసానమే ఈ నాటకం .జడ్జి గారి సహకారం తో విజయవంతం అయ్యింది . మా అవినాష్, చంద్ర వర్ధన్ వాయిసును స్టడీ చేసి అనుకరించాడు.అదే జూలి కి షాక్ తెప్పించింది.ఒకే ఒక్క క్షణంలో చంద్ర గొంతు ..తనే హత్యా ప్రయత్నం చేసిందన్న స్టేట్మెంటు ..అసలు ఆస్తికోసం చంద్రను చంపిన ప్లాన్ తలక్రిందు లవుతుందే మోనన్న భయం ఒక్కసారిగా మెదడును డామినేట్ చేయడంతో తట్టుకోలేక పోయింది. తన నాటకాన్ని మర్చిపోయి బయట పడిపోయింది."

బాలి మాటలు పూర్తి చేయక ముందే కరతాళ ధ్వనులతో హాల్ మారుమ్రోగి పోయింది.

హటాత్తుగా తన కూతురుతో వచ్చి బాలి పాదాల మీద పడిపోయింది శ్రీమతి మాలతీదేవి

.***




జాము రాత్రి గడిచినా వాలుకుర్చీ లో కూర్చొని తదేకంగా ఆలోచనలో పడ్డాడు పురుషోత్తం

భార్య పోయాక ఒంటరి బతుకైపోయింది

పేరుకు కొడుకు,కోడలు,పిల్లల్తో ఉన్నా ఎవరితోవ వారిదే కొడుకుకోడలు ఆఫీసుకి పోతే పిల్లలేమో స్కూళ్ళకి తను మాత్రం ఒంటరిగా...

వారాంతపు సెలవు రోజుల్లో పిల్లల్తో కొడుకు,కోడలు ఎటైనా వెళ్తే వాలు కుర్చీలో ఒంటరిగా తను...

ఈ ఒంటరి తనాన్ని భరించలేక తానూ భార్యతో పాటు పోయుంటే బాగుండేదని చాలాసార్లు అనుకున్నాడు .

కాని మన చేతుల్లో లేదుగా అని ఎన్నో సార్లు సమర్ధించుకున్నాడు...

ఉదయం జరిగిన సంగతే మనసులో మరీ మరీ తిరుగాడుతోంది.

ఈ వీకెండ్ కిట్టీ పార్టీ మనింట్లో…

అసలే పిల్లల్తో చేసుకోలేక చస్తూంటే ఈ ముసిలి ఘటం ఒకటి నా పీకలమీదికి….

ఎలాగైనా నేను చెప్పిన పని గుర్తుంచుకొని చెయ్యండి..

సరేలే ఆలోచిద్దాం అన్నాడు రవి .

ఆలోచించడం కాదు ఎలాగైనా ఆ ఫారాలూ అవీ తెచ్చి మీ నాన్నని ఆశ్రమం లో చేర్చండి అంది అది విన్న మొదలూ పురుషోత్తం ఆలోచనలకి అంతులేక పోయింది .

….

తెల్లారగానే తన పనులన్నీ ముగుంచుకుని కొడుకుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు

రెడీయా నాన్నా ..! పదా బోల్డెన్ని పనులున్నాయి …!అంటూ కారుకేసి పరుగు లాంటి నడకతో బయల్దేరాడు రవి .

వెనకనే భారంగా కదిలాడు పురుషోత్తం…..

….

కారు కస్తూరిబా శరణాలయం ముందాగింది .

కిటికీలోంచి చుట్టూ చూసి కారు దిగాడు.

నువ్విక్కడేవుండు నాన్నా..! నేనిప్పుడే వస్తా అంటూ రవి లోనికెళ్లాడు. చేసేదిలేక అరుగుమీద కూర్చొని అటూ,ఇటూ గమనించాడు ,

ఎదో పాత జ్ఞాపకాలు....

అటుగా వెళ్తున్న రంగమ్మ పురుషోత్తంని చూసి....

" గుర్తున్నానా....? బాబుగారూ " అంటూ పలకరించింది.

" ఆ..లేకేం .. " అంటూ రంగమ్మతో పిచ్చా,పాటి మాటల్లో పడిపోయాడు పురుషోత్తం.

ఫారాలు అవీ నింపి ఓ అరగంట తర్వాత చేరుకున్న రవి తండ్రి ఆయాతో కులాసాగా మాట్లాడుతుంటే తనపని అయిపోయినట్టు ఫీలయ్యి " పద నాన్నా తొందరగా " అంటూ లోనికి దారి తీసి అక్కడున్న మేనేజర్ కి అప్పగించి అమ్మయ్యా..! అనుకోని వెనుదిరిగాడు రవి. వస్తుంటే ఎందుకో రంగమ్మ గుర్తొచ్చింది రవికి.

అమ్మ పోయినదగ్గరినుంచి ఎవరితోనూ మాట్లాడని నాన్న ఇంతసేపు రంగమ్మతో ఎం మాట్లాడాడో అనుకుంటూ అదే ప్రశ్నగా రంగమ్మని అడిగాడు " యేమ్మా....! ఆయనేదో పరిచయస్తుడిలా అంతసేపు మాట్లాడవు....ఏమంటాడేమిటి? "

" నా మీదేమైనా చెప్పాడా ఆ ముసిలోడు ? " అన్నాడు రవి .

రంగమ్మ సమాధానంతో దిమ్మ తిరిగినట్లయింది రవికి

" లేదు బాబూ...! ఓ ముప్పయేళ్ళయ్యిందనుకుంటా ఆయన్ని చూసి ఓ రోజు నీలాగే వచ్చాడు. ఎవరైనా ఓ రెండు,మూడేళ్ళ మగ పిల్లవాడు కావాలి పెంచుకోడానికి , అని తనకి పిల్లలులేరని ఆవిడ ఊరికే గొడవ పెడ్తుంటే భరించలేక వచ్చానని అన్నాడు , పెంచుకోడానికి ఓ మగ పిల్లాడ్ని తీసుకెళ్తూ నాకో ఐదొందలు ఇచ్చిన ధర్మాత్ముడు , పెంచుకున్న బిడ్డ యేమయినాడో మరి ఇన్నాళ్ళకి యిలా యిక్కడ కనిపించాడు , పగోళ్లకి కూడా యిలాంటి పరిస్థితి రాకూడదు బాబూ " అంది .

విన్న రవికి పోగొట్టుకున్నదేంటో అర్ధమైంది... యిక్కడ పెరగ వలసిన తనకి అన్నీ యిచ్చిన మహానుభావుడికి తనిచ్చిన కానుక యిదా ? అనుకుంటూ కారు వైపు నడిచేడు .

ఎక్కడో మైకులో వస్తున్న ' ఇంతేరా యీ జీవతం తిరిగే రంగుల రాట్నము ' అనే పాట వినిపించే అవకాశం లేదు ఎసి కారులో వున్న రవికి .